Follow: @ANNTELUGU

ANN తెలుగు

22-07-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 228 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM



## అభిమానుల వల్లే నేనిక్కడ నిలబడ్డా..

### మీకు నచ్చితే బాక్సాఫీస్ బద్దలు కొట్టేయండి

### హరిహర వేడుకలో పవన్‌కల్యాణ్

**హైదరాబాద్, మహా :** రికార్డులు కోసం తానెప్పుడూ సినిమాలు చేయలేదని, సగటు మనిషిగా బతుకుదామన్న ఆలోచన తప్ప తనకేమీ కోరికలూ లేవని అగ్ర కథానాయకుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తాను ఈ స్థాయిలో నిలబడటానికి అభిమానులే కారణమని తెలిపారు. ఆయన కథానాయకుడిగా నటించిన పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు' సినిమా ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్ లో జరిగింది. మిగతా 2లో

**టాప్ న్యూస్**

### బీజేపీలోకి మాజీమంత్రి మల్లారెడ్డి కోడలు?


- కేంద్రమంత్రి బండి సంజయ్‌తో కలిసి లంచ్ భేటీ
- పాతబస్తీలో బండి సంజయ్, ప్రీతిరెడ్డి ఫొటోతో ఫ్లెక్సీలు



02

### సభలో నన్ను మాట్లాడనీయడం లేదు

- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఫైర్



02

### మతపరమైన రిజర్వేషన్లు బీజేపీ వ్యతిరేకం

- లీగల్ ఒపీనియన్ లేకుండా ఆర్డినెన్స్ తెచ్చారు
- బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు



02



## సినీ సెలబ్రిటీలకు షాక్!

- బెట్టింగ్ యాప్ కేసులో యాక్టర్లకు నోటీసులు
- దగ్గుబాటి రానా, ప్రకాష్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీ ప్రసన్న వేర్వేరుగా విచారణకు ఆదేశం

వివరాలు 2లో



## ఉభయ సభల్లో రభస


- సభ్యులు కోరుకున్నన్ని రోజులు చర్చ
- రాజ్యసభ ఛైర్మన్ హామీ

వివరాలు 3లో

# ఉపరాష్ట్రపతి రాజీనామా

## రెండేళ్ల పదవీకాలం ఉండగానే గుడ్ బై

- దేశంలో సంచలనంగా జగదీప్ దన్ఖడ్ నిర్ణయం
- ఆరోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖ
- తొలిరోజు పార్లమెంట్ సమావేశాలకు హాజరైన జగదీప్
- రాజకీయ కారణాలతోనే వైదొలిగారని ప్రచారం



**ఢిల్లీ, మహా:** ఉపరాష్ట్ర పతి జగదీప్ దన్ఖడ్ అనూహ్య నిర్ణయంతో దేశంలో సంచలనంగా మారారు. ఉపరాష్ట్రపతి పదవికి సోమవారం రాత్రి ఆయన రాజీనామా చేశారు. అనారోగ్య కారణాల వల్ల రాజీనామా చేసినట్టు ఆయన వెల్లడించారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు దన్ఖడ్‌కు పంపారు. 2022 జులైలో జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో దన్ఖడ్ విజయం సాధించారు. అదే ఏడాది ఆగస్టు 11న ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉన్నారు. రెండేళ్ల పదవీకాలం ఉండగానే ఆయన రాజీనామా చేయడం గమనార్హం. మిగతా 2లో

### రేసులో చిరంజీవి

ఉపరాష్ట్రపతి పదవికి రేసులో మెగాస్టార్ చిరంజీవి పేరు వినబడుతోంది. గతంలో దన్ ఖర్ పదవీవిరమణ తర్వాత ఆ పదవిలో చిరంజీవిని నియమించాలన్న చర్చలు జరిగాయి. ఇపుడు అనూహ్యంగా రాజీనామా చేయడంతో తెలుగు రాష్ట్రాల రాజకీయాలు మారిపోయే సూచనలు కనబడుతున్నాయి. చిరంజీవి గతంలో రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర పర్యాటక శాఖా మంత్రి దేశమంతా రాజకీయ పరిచయాలు కూడా ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో ఎంతో కాలంగా పట్టుకోసం చూస్తున్న భాజపాకు ఇది ఒక అవకాశంగా పేర్కొంటున్నాయి. చిరంజీవి ప్రభావం తెలుగు రాష్ట్రాలే కాక తమిళనాడు, కర్నాటక లో కూడా ఉంది. బిహార్ ఎన్నికల నేపథ్యంలో పరిశీలిస్తే అక్కడి వారు ఎవరికైనా ఛాన్స్ దక్కవచ్చన్న చర్చలు కూడా ఉన్నాయి.

# 15 రోజులు రేషన్ కార్డుల పండుగ

## జులై 15 నుండి ఆగస్టు 10 దాకా పంపిణీ

- భారీవర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- యూరియా కొరత లేదు..
- స్టాక్ బోర్డులు పెట్టండి
- కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, మహా :** వర్షాలు కురుస్తున్న వేళ పరిపాలన, ప్రజల ఇబ్బందులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. వానలు, సీజనల్ వ్యాధులు, నీళ్లను ఒడిసిపట్టుకోని అవసరం మేర వినియోగించుకోవడం, యూరియా నిల్వలు, రేషన్ కార్డుల పంపిణీపై కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిగతా 2లో

### ఏటీసీల్లో ఫార్మా, లైఫ్ సైన్సెస్ కోర్సులు

- జీనోమ్ వ్యాలీలో మోడల్ ఏటీసీ ఏర్పాటు చేయాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- గిగ్ వర్కర్ల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ఏటీసీ, తెలంగాణ రైజింగ్-2047పై సీఎం సమీక్ష

02

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 190 | 230 | 250 |

హోల్ సేల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 170 | 210 | 220 |

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,00,150 |
| 22 క్యారెట్ | 91,800 |
| సిల్వర్ (కేజీ) | 1,16,000 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 82,200.34 |
| నిఫ్టీ ↗ | 25,090.70 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.1 | 153 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.1 | 153 |
| రిటైల్ గుడ్డు ధర | 5.41 | 162.18 |

## జీవో 49 నిలిపివేత

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- ఆదివాసీల్లో అనుమానాలు నెలకొన్న నేపథ్యంలో సర్కారు నిర్ణయం
- ప్రజా ప్రభుత్వం అడవి బిడ్డలకు ఎప్పుడూ అండగా ఉంటుంది: కొండా సురేఖ



**హైదరాబాద్, మహా :** జీవో 49 ని నిలిపి వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిది. ఈ జీవో జారీ తర్వాత ఏజన్సీ ప్రాంతాలలోని ఆదివాసీలు, గిరిజనులు ఆందోళనలకు దిగడంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మిగతా 2లో

### కల్లు దుకాణాలు బంద్ చేస్తామంటే ఊరుకోం!

వివరాలు 2లో

### 24న ఢిల్లీకి సీఎం రేవంత్, భట్టి

- పార్లమెంట్ సెషన్స్ వేళ
- రిజర్వేషన్ల అంశంపై ఖర్గే, రాహుల్‌తో చర్చలు
- కులగణన సర్వేపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- అనంతరం రిజర్వేషన్ల బిల్లుల విషయంపై మోదీని కలిసే చాన్స్?

వివరాలు 2లో

### ప్రభుత్వానికి రెండు కళ్లు.. అభివృద్ధి.. సంక్షేమం...

- మహిళల సాధికారత పెంపు కోసం ఎన్నో సంక్షేమ పథకాలు
- 21 వేల కోట్లు రుణమాఫీ.. 9 వేల కోట్లు రైతు భరోసా చెల్లింపు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు


వివరాలు 2లో

## నా పార్టీలోనే ప్రత్యర్థులున్నారు

### ఒక వ్యక్తితో తప్పా పార్టీలో నాకు ఎవరితో ఇబ్బందులు లేవు

### కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, మహా :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ తనపై జరిగిన దాడికి సూత్రధారులు అతడే అంటూ సంచలన ఆరోపణలు చేశారు. 'నా పార్టీలోనే ప్రత్యర్థులున్నారు. ఒక్క వ్యక్తితో తప్ప పార్టీలో ఎవరితో నాకు ఇబ్బందుల్లేవు. నా నియోజకవర్గానికి చెందిన ఆ వ్యక్తే (గొల్లకిట్టు) నాపై ఈ దాడి చేయించాడని అనుమానంగా ఉంది. కచ్చితంగా ఉద్దేశపూర్వకంగానే ఈ దాడి జరిగింది. డ్రైవర్ పైకి రాకుండా డైరెక్ట్ నన్ను టార్గెట్ చేస్తూ దాడి చేశారు. నాపై దాడి చేసిందంతా బయట నియోజకవర్గానికి చెందినవాళ్లే. ఈ దాడి గురించి పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేయమని పోలీస్ అధికారులు సూచించారు' అని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. 'నాపై దాడి చేస్తానని.. నన్ను అంతం చేస్తానని కొందరు చెప్పుకుంటూ తిరుగుతున్నారు.



యాక్షన్ తీసుకోకపోతే నా రియాక్షన్ వేరేలాగా ఉంటుంది. పార్టీలో తాను ఒక్కడినే ఉండాలి. తాను చెప్పినట్టే వినాలని అనుకుంటే ఎలా అని ప్రశ్నించారు. మిగతా 3లో

# 15 రోజులు రేషన్ కార్డుల పండుగ



(మొదటిపేజీ తరువాయి)

భారీ వర్షాలపై 3 గంటల ముందే ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉంటే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చించారు. నీళ్ల నిల్వ ఉండే ప్రాంతాల్లో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షం పడేటప్పుడు బయట ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**సరిపడ నిల్వలున్నా దుష్ప్రచారం**

సాగు పనులు జోరుగా సాగుతున్న వేళ నీటి నిర్వహణ తో పాటు ఎరువుల అంశంలోనూ చర్యలు తీసుకోవాలని సీఎం కలెక్టర్లకు ఆదేశించారు.

సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయన్న రేవంత్ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వివరించారు. ఫర్టిలైజర్ షాపులన్నింటి ముందు స్టాక్ వివరాలు తప్పనిసరిగా బోర్డుపై డిస్ప్లే చేయాలని ఆదేశించారు. సబ్సిడీ ఎరువులను ఇతర అవసరాలు మళ్లిస్తూ రైతులకు నష్టం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని సీఎం స్పష్టం చేశారు. యూరియా అక్రమాలపై ఫిర్యాదు చేసేలా టోల్‌ఫ్రీ నెంబర్‌ను పబ్లిక్ ప్లేస్‌లలో పెట్టాలని సూచించారు.

**3.10కోట్ల మందికి రేషన్**


రాష్ట్రంలో రేషన్ కార్డు కింద సన్నబియ్యం ఇవ్వడం వల్లనే రేషన్‌కార్డుల డిమాండ్ పెరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పటివరకు 7లక్షలకు పైగా కొత్త రేషన్‌కార్డులు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో 96.95లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. 3.10కోట్ల మంది రేషన్ ఉపయోగించుకుంటున్నారని వివరించారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు రేషన్ కార్డుల పంపిణీ చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనాలని చెప్పారు. అన్ని మండల కేంద్రాల్లో రేషన్ కార్డుల పంపిణీ జరగాన్నారు. రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ ఆందోళన అవసరం లేదని తెలిపారు.

**హైదరాబాద్‌లో 150 బృందాలు**

భారీ వర్షాల దృష్ట్యాలతో హైదరాబాద్‌లో 150 బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఎం తెలిపారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా ముందుగానే టీమ్‌లను పంపిస్తున్నామని చెప్పారు. జిల్లాల్లో పిడుగుపాటుతో జరిగే నష్టాల వివరాలను నమోదు చేయాలని అధికారులను సూచించారు. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని చెప్పారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# మతపరమైన రిజర్వేషన్లు బీజేపీ వ్యతిరేకం

**లీగల్ ఒపీనియన్ లేకుండా ఆర్డినెన్స్ తెచ్చారు.. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు**



**న్యూఢిల్లీ, మహా :** మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని, బీసీలకు ఇచ్చే 42 శాతం రిజర్వేషన్లలో ముస్లింలకు 10 శాతం ఇవ్వడాన్ని సమర్థించే ప్రశ్నే లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించిన తర్వాత తొలిసారి ఢిల్లీకి వచ్చానని, పార్టీని ఎలా నడిపించాలనే విషయంపై పెద్దల మార్గదర్శనం తీసుకునేందుకు తన పర్యటన అని చెప్పారు. తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన రాంచందర్ రావు బీసీ బిల్లుపై పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. మీడియాతో మాట్లాడుతూ.. 46 సార్లు ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ దక్కలేదన్నారు. కానీ ప్రధానమంత్రి సహా కేంద్ర మంత్రులందరూ ఎప్పుడు అడిగితే అప్పుడు రేవంత్ రెడ్డికి సమయం ఇచ్చారని, మీ పార్టీ ముఖ్యమంత్రికి మీరే ఎందుకు సమయం ఇవ్వడం లేదన్నది చెప్పాలన్నారు. మతపరమైన రిజర్వేషన్లను మేము వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదో షెడ్యూల్ లో పెట్టడం కేంద్రం బాధ్యత అని అంటున్నారని, లీగల్ ఒపీనియన్ లేకుండా ఆర్డినెన్స్ తీసుకువచ్చారన్నారు. తొమ్మిదో షెడ్యూల్ లో పెట్టే ప్రక్రియ ముఖ్యమంత్రి కి తెలుసా ? అని ఆయన ప్రశ్నించారు. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టే అంశాలు కూడా న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, 2006లో అయ్యర్ కోహ్లీ కేసులో .. సుప్రీంకోర్టు మరోసారి కేశవనంద భారతి కేసు తీర్పును దగ్గర మరోసారి పునరుద్ఘాటించిందన్నారు. తెలంగాణ బీసీలను తప్పుదోవ పట్టించేందుకు ముఖ్యమంత్రి ఆర్డినెన్స్ తెచ్చారని మండిపడ్డారు. న్యాయపరమైన చిక్కులు తెలిసి బీసీలను మోసం చేస్తున్నందుకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలన్నారు. బీసీ బిల్లుకు, ఆర్డినెన్స్ కు మద్దతు ఇచ్చామని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదే అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ఎన్నికలు జరగకుండా ఉండేందుకు జరిగే ఎత్తుగడే ఈ మోసమని ఆయన ఆరోపించారు. తమిళనాడు తీర్పు నేపథ్యంలో తొమ్మిదో షెడ్యూల్ లో పెట్టే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు.

**పార్టీ లైన్ లోనే పని చేయాలి**

పార్టీ క్రమశిక్షణ దాటితే ఊరుకునే ప్రసక్తి లేదని, నాయకులందరూ పార్టీ విధానాలకు లోబడే పని చేయాలని, పరోక్షంగా ఈటల వ్యాఖ్యలపై మాట్లాడుతూ, ఆ అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కాంగ్రెస్‌లో రేవంత్ రాజగోపాల్ రెడ్డి మధ్య సమస్యలు.. బీఆర్ఎస్ లో కవితకు పార్టీకి మధ్య గొడవలు ఉన్నాయన్నారు. ప్రతి పార్టీలోనూ గొడవలు ఉన్నాయి వాటిని అంతర్గతంగా పరిష్కరించుకుంటామన్నారు. ఎవరైనా ఎంత పెద్ద వారైనా పార్టీ నిబంధనలకు అనుగుణంగా పని చేయాల్సిందేనని, పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా అదే సుప్రీం అని అన్నారు. రాజాసింగ్ అంశంపై స్పందిస్తూ ఆయనపై చర్యలు తీసుకోవడం ఆలస్యం అయిందన్నారు. ఓట్లు, సీట్లు అనేది బీజేపీ విధానం కాదని పార్టీ సిద్ధాంతమే ప్రధానమని అన్నారు.



# సభలో నన్ను మాట్లాడనీయడం లేదు

**ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఫైర్**

**ఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అధికార పక్షంపై విమర్శలు గుప్పించారు. సభలో విపక్షాలు ప్రస్తావించదలచిన అంశాలపై తనను మాట్లాడేందుకు అనుమతించడం లేదని రాహుల్ గాంధీ విమర్శించారు . కేంద్రమంత్రులను మాట్లాడేందుకు అనుమతిస్తూ విపక్షనేతగా ఉన్న తనను అనుమతించకపోవడం ఏంటని ప్రశ్నించారు. 'ప్రశ్న ఏంటంటే సభలో రక్షణ మంత్రిని మాట్లాడేందుకు అనుమతించారు. కానీ విపక్ష నాయకుడిగా ఉన్న నాతో సహా ప్రతిపక్ష సభ్యులను అనుమతించలేదు. ఇదో కొత్త తరహా విధానం. ప్రభుత్వం వైపు ఉన్న వాళ్లను మాట్లాడేందుకు అనుమతించినప్పుడు మాకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వడమే సంప్రదాయం' అని రాహుల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌పై చర్చించేందుకు సిద్ధమేనని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పడాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ప్రస్తావిస్తూ.. వాళ్లు చర్చించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు విపక్ష నేతను కూడా మాట్లాడనీయాలని, ఆయన మాట్లాడేందుకు లేచినప్పుడు అనుతించాల్సి ఉంటుందని అన్నారు.

# సినీ సెలబ్రిటీలకు షాక్!

**హైదరాబాద్, మహా:** బెట్టింగ్ యాప్ కేసులో నిందితులుగా ఉన్న సినీ సెలబ్రిటీలకు షాక్ తగిలింది. బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ అధికారులు ముమ్మరంగా విచారణ చేస్తున్నారు. నిందితులుగా ఉన్న సినీ సెలబ్రిటీలకు సోమవారం నోటీసులు జారీ చేశారు ఈడీ అధికారులు. దగ్గుబాటి రానా, ప్రకాష్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీ ప్రసన్న విచారణకి హాజరవ్వాలని నోటీసులు పంపించారు. జులై 23న దగ్గుబాటి రానా, జులై 30న ప్రకాష్ రాజ్, ఆగస్టు 6న విజయ్ దేవరకొండ, ఆగస్టు 13న మంచు లక్ష్మీప్రసన్నను విచారణకి హాజరవ్వాలని నోటీసులో తెలిపారు. విదేశీ బెట్టింగ్ యాప్‌లను వీరు ప్రమోట్ చేసినట్లు ఈడీ అధికారులు గుర్తించారు.

**నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే..**

ఈ క్రమంలో దగ్గుబాటి రానా, ప్రకాష్ రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీప్రసన్నని మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు ఆయా కంపెనీల నుంచి సినీ సెలబ్రిటీలకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై విచారణ చేయనున్నారు ఈడీ అధికారులు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేశారు. సినీ సెలబ్రిటీలు బెట్టింగ్ యాప్‌లని ప్రమోట్ చేయడంతోనే పలువురు ఆకర్షితులు అయ్యారని ఈడీ అధికారులు, పోలీసులు చెబుతున్నారు. బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి అమాయకులు మోసపోయినట్లు అధికారులకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఈడీ అధికారులు, పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు.

# ఏటీసీల్లో ఫార్మా, లైఫ్ సైన్సెస్ కోర్సులు

**జీనోమ్ వ్యాలీలో మోడల్ ఏటీసీ ఏర్పాటు చేయాలి**

**అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**

గిగ్ వర్కర్ల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని నిర్ణయం

ఏటీసీ, తెలంగాణ రైజింగ్-2047పై ముఖ్యమంత్రి సమీక్ష

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. 'తెలంగాణ రైజింగ్2047' పై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందుకు అనుగుణంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ అభివృద్ధి, పురోగతిపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏటీసీల అభివృద్ధి, పనుల్లో పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత సమయానికి అనుగుణంగా వీలైనంత త్వరగా ఏటీసీల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీ..**

రాష్ట్రంలో ఏటీసీల అభివృద్ధి, పురోగతిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని సీఎం చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మూడు దశల్లో 111 ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు అధికారులు. ఫేజ్ 1లో 25, ఫేజ్ 2లో 40, ఫేజ్ 3లో 46 ఏటీసీలని అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఫేజ్ 1, ఫేజ్ 2లో ఇప్పటి వరకు 49 ఏటీసీలు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు అధికారులు. ఏటీసీలను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైతే నైపుణ్యం కలిగిన నిర్మాణ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి. ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందించే కోర్సులు అక్కడ నిర్వహించాలని సూచించారు. అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

**గిగ్ వర్కర్లకు సర్కార్ గుడ్ న్యూస్..**

అలాగే గిగ్ వర్కర్స్ పాలసీపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. గిగ్ కార్మికులకు ప్రతిపాదిత పాలసీని సమీక్షలో ముఖ్యమంత్రికి వివరించారు అధికారులు. గిగ్ వర్కర్స్‌కు చట్టబద్ధమైన గుర్తింపు అంశాన్ని పాలసీలో ప్రతిపాదించారు అధికారులు. సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించేలా ప్రతిపాదనలు చేశారు. గిగ్ కార్మికుల పాలసీపై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. గిగ్ కార్మికులకు సంబంధించిన పూర్తి డేటా ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు గిగ్ వర్కర్లకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్స్‌రెన్స్ సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు.



# బీజేపీలోకి మాజీమంత్రి మల్లారెడ్డి కోడలు?

- కేంద్రమంత్రి బండి సంజయ్ తో కలిసి లంచ్ భేటీ
- పాతబస్తీలో బండి సంజయ్, ప్రీతిరెడ్డి ఫొటోతో ఫ్లెక్సీలు

**హైదరాబాద్, మహా:** మాజీమంత్రి, ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోడలు బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్‌తో సమావేశం కావడం రాజకీయ చర్చకు దారితీసింది. హైదరాబాద్ లోని మేకలమండికి చెందిన ఒక బీజేపీ నాయకుని ఇంట్లో కేంద్రమంత్రితో కలిసి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి లంచ్ చేయడంతో ఆమె బీజేపీలో చేరుతున్నారనే ప్రచారానికి తెరలేపింది. ప్రీతిరెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్నారు. అలాంటిది బండి సంజయ్‌తో భేటీ కావడం ఇరు పార్టీల్లో హాట్ టాపిక్ గా మారింది. అంతేకాదు, ఆమె బీజేపీ వైపు చూస్తున్నారనడానికి గుర్తుగా నిన్న పాతబస్తీలో జరిగిన బోనాల వేడుకల్లో బండి సంజయ్ ఫొటోతో కూడిన ప్రీతిరెడ్డి ఫ్లెక్సీలు వెలిశాయి. ఆ మరునాడే ఇరువురు ప్రత్యేకంగా సమావేశం కావడం వెనుక రాజకీయ కారణాలు తప్ప మరేం లేదని పలువురు అంటున్నారు. ప్రీతిరెడ్డి త్వరలోనే బీజేపీలో చేరుతున్నారని, అందుకే బీజేపీ నాయకులతో చర్చలు జరుపుతోందని వార్తలు వినిపిస్తున్నాయి.

# జీవో 49 నిలిపివేత

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

ఆదివాసీల్లో అనుమానాలు నెలకొన్న నేపథ్యంలో సర్కారు నిర్ణయం

ప్రజా ప్రభుత్వం అడవి బిడ్డలకు ఎప్పుడూ అండగా ఉంటుంది: కొండా సురేఖ

(మొదటిపేజీ తరువాయి)

పులుల కారిడార్ కవ్వాల్ అభయారణ్యంలో భాగంగా ఉన్న ఆసిఫాబాద్ ప్రాంతాన్ని కుమురంభీం పులుల కన్జర్వేషన్ రిజర్వుగా మారుస్తూ గత నెల 30న అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యా ణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లలో లక్ష 49 వేల హెక్టార్లను టైగర్ రిజర్వులోకి మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జీవో 49 మీద స్థానిక ఆదివాసీల్లో అనుమానాలు, అభ్యంతరాలు నెలకొన్న నేపథ్యంలో వాటిపై పలు దఫాలు మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, సీతక్క భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మంత్రులు సమావేశాలు నిర్వహించి, సమగ్ర వివరాలు సేకరించారు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో స్థానిక కలెక్టర్ నుంచి మరొకసారి నివేదిక తెప్పించుకున్న ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో 49 ని నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అడవి బిడ్డలకు ఎప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పునరుద్ఘాటించారు. ఆదిలాబాద్ ఇంచార్జీ మంత్రి జూపల్లి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఆదివాసీ బిడ్డ సీతక్క సమిష్టిగా నిర్ణయం తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివేదించగా. ఆయన ఆదేశాల మేరకు సోమవారం జీవో 49 అబేయన్స్ లో పెడుతూ అటవీ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జీవో విడుదల కోసం 330 ప్రభావిత గ్రామాల ప్రజల్లో నెలకొన్న అనుమానాలా నివృత్తి చేసేందుకు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో మంత్రులు సమగ్ర వివరాలు సేకరించారు. స్థానిక ఆదివాసీల విజ్ఞప్తి మేరకు... సీఎం రేవంత్ రెడ్డికి ఈ విషయాన్ని నివేదించి... అబేయన్స్ లో పెట్టాలని ప్రభుత్వం ముందడుగు వేసింది. అయితే, రానున్న రోజుల్లో కూడా ఆదివాసీలకు ఇబ్బందులకు రాకుండా చూసుకుంటామని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ హామీనిచ్చారు. తమ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమమే ధ్యేయం అని వ్యాఖ్యానించారు.

# కల్లు దుకాణాలు బంద్ చేస్తామంటే ఊరుకోం!

**ప్రభుత్వంపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఫైర్**



**హైదరాబాద్, మహా:** ప్రభుత్వంపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల వృత్తులను కాపాడుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని నాశనం చేయాలని చూస్తుందని అన్నారు. ఏ కుల వృత్తిపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆదాయం వచ్చే కుల వృత్తులను ప్రభుత్వం నాశనం చేయాలని చూస్తోందన్నారు. గీత కార్మికులకు ఐదు ఎకరాల పొలం ఇస్తామని చెప్పారు. గీత కార్మికులు చెట్లపై నుంచి పడి చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లుగీత వృత్తిని బంద్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కల్లు కంపౌండ్ ద్వారా పది కులాలు బ్రతుకుతున్నాయి. ఉప్పల్‌లో తాటి చెట్లు కొట్టి గీత కార్మికులకు నష్టం చేశారు.

**నీరాను ప్రైవేటు వాళ్లకు..**

కల్లు కంపౌండ్‌ను నిషేధిస్తామని ప్రభుత్వం లీకులు ఇస్తోంది. లిక్కర్ కంపెనీలు, డిస్టలరీలన్ని ఒకరిద్దరి చేతుల్లో నడుస్తున్నాయి. లిక్కర్ కంపెనీల కమీషన్లకు కక్కుర్తిపడి, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లు కాంపౌండ్ బంద్ చేయాలని చూస్తున్నారు. కల్లులో మీరే ఏదో కలిపి కుట్ర చేస్తూ ఓఆర్ఆర్ లోపల కల్లుపై నిషేధం విధించాలని చూస్తున్నారు. ఎన్టీఆర్ మధ్య నిషేధం సమయంలోనూ కల్లును నిషేధించలేదు. కల్లు, నీరాకు ఔషధ గుణాలు ఉంటాయి. నీరాను ప్రైవేటు వాళ్లకు అప్పగించారు. కుల వృత్తిని అవమానించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని నిషేధించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలం అవుతుంది. కల్తీ పాలు అరికట్టడంపై ప్రభుత్వం ఎందుకు దృష్టి పెట్టడం లేదు. రాష్ట్రంలో విచ్చలవిడిగా ఫార్మా కంపెనీలకు పర్మిషన్లు ఇస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను తెలంగాణలో అమ్ముతున్నారు.

**మామూళ్లు తీసుకుంటున్న ఎమ్మెల్యేల పేర్లు బయటపెడతాం..**

నిజామాబాద్ జిల్లాలో గౌడ కులస్తులపై నిషేధం విధించారు. 60 మంది గౌడ కుల స్త్రీలు గుడికి వెళ్తే గుళ్లోకి రావద్దని వెనక్కి పంపారు. లక్షలు, లక్షలు మామూళ్లు తీసుకుని కల్లు దుకాణాలు బంద్ చేస్తామంటే చూస్తూ ఊరుకోం. కల్లు దుకాణాలు బంద్ పెడితే బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద మామూళ్లు తీసుకుంటున్న ఎమ్మెల్యేల పేర్లు బయటపెడతాం. హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలో గీత చెట్లు ఉన్నాయి. కల్లు కంపౌండ్ పేదోళ్లకు రిక్రియేషన్ సెంటర్ లాగా ఉంటుంది. తాము అధికారంలోకి వచ్చాక లిక్కర్ మాఫియా నుంచి, కల్లు కంపౌండ్ నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. అలాగే తాటి చెట్లు నరికిన వారిపై కేసులు పెట్టాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు.

# 24న ఢిల్లీకి సీఎం రేవంత్, భట్టి

- పార్లమెంట్ సెషన్స్ వేళ
- రిజర్వేషన్ల అంశంపై ఖర్గే, రాహుల్‌తో చర్చలు
- కులగణన సర్వేపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- అనంతరం రిజర్వేషన్ల బిల్లుల విషయంపై మోదీని కలిసే చాన్స్?


**హైదరాబాద్, మహా:** తెలంగాణలో చేపట్టిన కులగణన అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ నెల 24న దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లనున్నారు. పార్లమెంట్ వర్షాకాలం సమావేశాలు జరుగుతున్న వేళ ఢిల్లీలో పర్యటించబోతున్నట్లు కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీలకు కులగణన వివరాలతో పాటు, రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బీసీ) కోటాను 42 శాతానికి పెంచే విషయంపై ఆయన వివరించనున్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేత, ఎంపీ మల్లు రవి సోమవారం ఓ మీడియా సంస్థకు ఈ వివరాలను వెల్లడించారు. బీసీలకు కోటా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల సర్వే గురించి ముఖ్యమంత్రి కాంగ్రెస్ అగ్ర నాయకత్వానికి, పార్టీ ఎంపీలకు వివరిస్తారని ఆయన తెలిపారు. 'వెనుకబడిన తరగతుల కోటాను పెంచడంపై ముఖ్యమంత్రి జూలై 24న ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీకి వివరిస్తారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీలందరికీ తెలియజేస్తారు' అని మల్లు రవి అన్నారు. కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లుల విషయంలో రేవంత్ రెడ్డి ప్రధానిని కలవబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి నరేంద్ర మోడీ వద్దకు వెళ్లి బీసీ రిజర్వేషన్ల పెంపుకు సహకరించాలని కోరాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# అభిమానుల వల్లే నేనిక్కడ నిలబడ్డా..

**మీకు నచ్చితే బాక్సాఫీస్ బద్దలు కొట్టేయండి**

హరిహర వేడుకలో పవన్‌కల్యాణ్

(మొదటిపేజీ తరువాయి)



ఈ వేడుకలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "ఇలాంటి వేడుక చేసుకోవాలంటే చాలా ఒత్తిడి ఉంటుంది. ఈ కార్యక్రమానికి అనుమతి ఇచ్చిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, పోలీసుశాఖ వారికి ధన్యవాదాలు. నేను రాజకీయాల్లోకి వచ్చాక మంచి స్నేహితుడిని సంపాదించుకున్నా. ఆయనే కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే. కర్ణాటక నుంచి ఈ కార్యక్రమానికి వచ్చినందుకు ధన్యవాదాలు. 'భీమ్లా నాయక్' విడుదలైనప్పుడు అందరి సినిమాల టికెట్‌లు రూ.100ల్లో ఉంటే.. పవన్ సినిమా టికెట్‌ను రూ.10, రూ.15 చేశారు. నేను ఒకటే చెప్పాను. 'మనల్ని ఎవడ్రా ఆపేది'. ఇది డబ్బు కోసమో.. రికార్డులు కోసమో కాదు.. ఇది ధైర్యం కోసం.. సాహసం కోసం.. న్యాయం కోసం నిలబడ్డాం. పవన్‌కల్యాణ్ ఎప్పుడూ రికార్డుల కోసం ప్రయత్నం చేయలేదు. సగటు మనిషిగా బతుకుదామన్న ఆలోచన తప్ప నేనేమీ కోరుకోలేదు. నేను ఇక్కడ ఈ స్థాయిలో నిలబడినా, రాజకీయాల్లో పడి లేచినా, కారణం మీరే . నా దగ్గర ఆయుధాల్లేవు, గుండాలు లేరు. గుండెల్లో అభిమానులే ఉన్నారు".

**జానీ ఫ్లాప్ వల్ల గ్రిప్ పోయింది**

"చిత్ర పరిశ్రమకు వచ్చి దాదాపు 30ఏళ్లు అవుతోంది. వయసు పెరిగిందేమో కానీ, గుండెల్లో చేవ మాత్రం చావలేదు. 'గబ్బర్‌సింగ్' సినిమా సమయంలో ఒక హిట్ ఇవ్వమని ఓ అభిమాని అడిగాడు. అది హరీశ్ శంకర్ వల్ల తిరిగి వచ్చింది. ఈ సినిమా కూడా చాలా క్లిష్టమైన సమయంలో చేశా. 'జానీ' సినిమా ఫెయిల్ అయినా అభిమానులు వదల్లేదు. కానీ, అన్ని బంధాలూ డబ్బుతో ముడిపడి ఉంటాయి కదా! నా రెమ్యునరేషన్ తిరిగి ఇచ్చేశాను. నేనెప్పుడూ బంధాలకు ప్రాముఖ్యత ఇచ్చాను. ప్రధాని నుంచి అందరూ నాకు తెలుసు. కానీ, దాని వల్ల డబ్బులు రావు కదా. మిమ్మల్ని ఆనందింపజేయాలనే ఈ మూవీ చేశా. 'ఎప్పుడూ రీమేక్‌లు చేస్తా'వని అందరూ నన్ను తిడతారు. మనకేమీ పెద్ద పెద్ద దర్శకులు ఎవరూ లేరు. నేను చేసిన పాపం అప్పట్లో ఆ ఒక్క ఫ్లాప్ ఇవ్వడమే. మళ్లీ సినిమాపై నాకు గ్రిప్ దొరకలేదు. అప్పుడు నాకు అండగా నిలబడిన వ్యక్తి త్రివిక్రమ్. కష్టాల్లో ఉన్న నాతో 'జల్సా' మూవీ చేసి మంచి హిట్ ఇచ్చాడు"

**బాక్సాఫీస్ బద్దలు కొట్టండి**

రాజకీయాల్లోకి వచ్చాక రియల్ లైఫ్ గుండాలు, రౌడీలను ఎదుర్కొన్నా కానీ, సినిమాటిక్‌గా చేయడానికి కష్టపడాల్సి వచ్చింది. అందుకే ఎప్పుడో నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ మళ్లీ సాధన చేసి, క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌కు దర్శకత్వం వహించా. ఈ మూవీ ఎన్ని కోట్లు కలెక్ట్ చేస్తుందో చెప్పలేను. మీరు కోరుకునే సక్సెస్ నేనూ కోరుకుంటున్నా. మీకు నచ్చితే బాక్సాఫీస్ బద్దలు కొట్టేయండి. మీరే నా బలం. ఈ గుండె మీకోసమే కొట్టుకుంటుంది. మీ కష్టాలను తీర్చడానికి కొట్టుకుంటుంది. జై భారత్.. జై హింద్" అని పవన్ కల్యాణ్ అన్నారు.

# ఉపరాష్ట్రపతి రాజీనామా

**రెండేళ్ల పదవీకాలం ఉండగానే గుడ్ బై**

దేశంలో సంచలనంగా జగదీప్ దన్ఖడ్ నిర్ణయం

ఆరోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖ

తొలిరోజు పార్లమెంట్ సమావేశాలకు హాజరైన జగదీప్

రాజకీయ కారణాలతోనే వైదొలిగారని ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

గత కొంత కాలంగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నట్లు రాజీనామా లేఖలో పేర్కొన్న ఆయన.. ఈ పదవిలో కొనసాగలేనని పేర్కొన్నారు. తన స్థానంలో వేరొకరికి బాధ్యతలు కట్టబెట్టాలని సూచించారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీలకు కృతజ్ఞతలు తెలిపారు. 199091 మధ్య కేంద్ర మంత్రిగా ఉన్న జగదీప్ దన్ఖడ్.. 2003లో బీజేపీలో చేరారు. 1979 నుంచి 90 మధ్య రాజస్థాన్ హైకోర్టు లాయర్‌గా ఉన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలైన తొలిరోజే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది. సోమవారం రాజ్యసభ ప్రారంభమైన తర్వాత విపక్షాలు చేస్తోన్న ఆరోపణలపై జగదీప్ దన్ఖడ్ స్పందిస్తూ.. రాజకీయ పార్టీలకు గట్టి సందేశం ఇచ్చారు. ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి అంటే.. పదేపదే అభ్యంతరకర వ్యాఖ్యలు, పరస్పర దూషణలు కాకుండా, పరస్పర గౌరవంతో కూడిన రాజకీయ సంస్కృతి అవసరమని ఆయన పిలుపునిచ్చారు. 'రాజకీయ ప్రతిస్పర్ధ వాస్తవికమే అయినా, రాజకీయాలు అంటే ఎదురుదెబ్బలు కాదు. దేశ ప్రయోజనాల విషయంలో ఎవరూ విభేదించరని నేను నమ్ముతాను' అని ఆయన చెప్పారు. భారతదేశ చారిత్రక బలం కూడా చర్చలు, సంప్రదింపులు, సంభాషణలపైనే ఆధారపడి ఉందన్నారు. ఆ బాటలోనే పార్లమెంటు చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ఎంపీలకు ఆయన పిలుపునిచ్చారు. రాజకీయ కారణాలతోనే ఆయన రాజీనామా చేసినట్టు తెలుస్తోంది.

# ఉభయ సభల్లో రభస

## సభ్యులు కోరుకున్నన్ని రోజులు చర్చ.. రాజ్యసభ ఛైర్మన్ హామీ

**మహా:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజు పహల్గాం ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు లోక్ సభ, రాజ్యసభలో విపక్షాలు పట్టుపట్టాయి. భారత్ పాక్ కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 24 సార్లు చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డాయి. దీనిపై పార్లమెంటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ చీఫ్, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గేతో పాటు ఇతర విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'లపై చర్చ కోసం రూల్ 267 కింద వారు రాజ్యసభలో వాయిదా నోటీసులను అందించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలపై చర్చలో పాల్గొనేందుకు నిరాకరించారు. పహల్గామ్ ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'లపై రెండు రోజుల పాటు ఉభయ సభల్లో చర్చించాలని జీరో అవర్‌లో ఖర్గే డిమాండ్ చేశారు. దీనిపై విపక్ష ఎంపీలంతా పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభ కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. 12 గంటలకు రాజ్యసభలో క్వశ్చన్ అవర్ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈక్రమంలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులను నేటికీ గుర్తించలేదన్నారు. ఉగ్రదాడి జరిగిన రోజున పహల్గాంలో భద్రతా లోపాలు ఉన్నాయని స్వయంగా జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఆ ఉగ్రదాడికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవాలని అన్ని పార్టీలు కోరుకుంటున్నాయని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన కొన్ని వివరాలను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్), డిప్యూటీ ఆర్మీ చీఫ్, మరో సీనియర్ ఆర్మీ ఉన్నతాధికారి వెల్లడించారని ఖర్గే చెప్పారు.

**సమగ్ర చర్చకు మేం రెడీ : నడ్డా**

మరోవైపు విపక్షాల డిమాండ్‌పై రాజ్యసభలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందించారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర చర్చకు నరేంద్ర మోదీ సారథ్యంలోని ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అలాంటి సైనిక ఆపరేషన్ ఎన్నడూ జరగలేదన్నారు. పహల్గాం ఉగ్రదాడిపైనా చర్చిస్తామని తెలిపారు. ఇంతకుముందు పార్లమెంటు బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలోనూ ఈ వివరాలను విపక్షాలకు తాము తెలిపామని నడ్డా చెప్పారు.

**పూర్తిస్థాయి చర్చ జరుగుతుంది : రాజ్యసభ ఛైర్మన్**

ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై సభ్యులు కోరుకున్నన్ని రోజులు పూర్తిస్థాయి చర్చ జరుగుతుందని విపక్ష ఎంపీలకు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ కూడా హామీ ఇచ్చారు. దీనిపై తాను అన్ని పార్టీల నేతలతో మాట్లాడుతానన్నారు. అయితే ఆలస్యం చేయకుండా ఆపరేషన్ సిందూర్‌పై వెంటనే చర్చను మొదలుపెట్టాలని ఖర్గే కోరారు. దీనిపై నడ్డా స్పందిస్తూ, తాము చర్చ నుంచి తప్పించుకునే యత్నం చేయడం లేదన్నారు. ఈక్రమంలో రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖర్ కలుగజేసుకుంటూ, అన్ని పార్టీల ఎంపీలు పరస్పర గౌరవ భావంతో మెలగాలని కోరారు.

# నా పార్టీలోనే ప్రత్యర్థులున్నారు

## ఒక వ్యక్తితో తప్పా పార్టీలో నాకు ఎవరితో ఇబ్బందులు లేవు

### కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సంచలన ఆరోపణలు



**(మొదటిపేజీ తరువాయి)**

పార్టీలో వాళ్ళని, వీళ్లని ఎంకరేజ్ చేయొద్దని అంటున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వచ్చే వాళ్లతోనే ఇబ్బందిగా ఉంది. పార్టీలో తాను తప్పా ఎవరు ఉండొద్దని గుండాయిజం చెయ్యడం సమంజసం కాదు. రెండు మూడు రోజుల్లో బహిరంగంగా అన్ని విషయాలు బయట పెడుతాను' అని అన్నారు. బోనాల సందర్భంగా ఆదివారం రాత్రి మాణికేశ్వర్ నగర్ లోని ఫలహారబండి కార్యక్రమానికి వెళ్తుండగా మార్గమార్గంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయన కారును ముట్టడించారు. ఒకేసారి సుమారు 20 మందికిపైగా వ్యక్తులు కారు ఆపి దాడికి యత్నించారు. అయితే గన్‌మెన్‌ల సమయస్ఫూర్తితో ఆయన ప్రాణాపాయం నుంచి తప్పించుకుని బయట పడగలిగారు. నేరుగా ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి ఘన తర్వాత మంత్రి వాకిటి శఅరీహరి నేరుగా ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ కు వెళ్ళి ఎమ్మెల్యే శ్రీగణేష్ తో మాట్లాడారు. అదే విధంగా సీఎం రేవంత్ రెడ్డి శ్రీగణేష్ కు ఫోన్ చేసి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

# తెలంగాణలోనూ పెరిగిన హరి హర వీరమల్లు టికెట్ల ధరలు


## ఒక రోజు ముందే స్పెషల్ ప్రీమియర్ షో

### రూ. 150 నుంచి రూ. 200 వరకు పెంపునకు అనుమతి

**హైదరాబాద్, మహా:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటించిన హరి హర వీరమల్లు మూవీ టికెట్ల ధరల పెంపుకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్ లలో ధరలు పెంపు ఒక్కోలా ఉంది. ఇక స్పెషల్ ప్రీమియర్ షోలకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఒక రోజు ముందే ఈ షోలు ఉండనున్నాయి. హరి హర వీరమల్లు మూవీ టికెట్ల ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇస్తూ సోమవారం తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. అంతేకాదు జులై 23 రాత్రి 9 గంటలకు ఓ స్పెషల్ షోకి కూడా అనుమతి ఇచ్చింది. ఈ షోకి టికెట్ల ధరను రూ. 600గా నిర్ణయించారు.

**మల్టీప్లెక్స్ లలో రూ.531 వరకు..**

ఇక తొలి నాలుగు రోజుల పాటు ఒకలా, తర్వాత 6 రోజుల పాటు మరోలా టికెట్ల ధరల పెంపు ఉండనుంది. తొలి నాలుగు రోజులు సింగిల్ స్క్రీన్లలో టికెట్ పై రూ.150, మల్టీప్లెక్స్ లలో రూ.200 పెంచు




కోవడానికి అనుమతి ఇచ్చారు. దీంతో సింగిల్ స్క్రీన్ల లో ధరలు రూ.354 వరకు, మల్టీప్లెక్స్ లలో రూ.531 వరకు ఉండనుంది. రోజుకు ఐదు షోలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇక ఐదు నుంచి 10వ రోజు వరకు సింగిల్ స్క్రీన్లలో రూ.106, మల్టీప్లెక్స్ లలో రూ.150 వరకు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చారు. అటు ఏపీ ప్రభుత్వం కూడా ఇప్పటికే తొలి 10 రోజులపాటు టికెట్ల ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే.

## శ్రావణమాసం... పండుగల మాసం..

హిందువులు వ్రతాలకు.. పూజలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ఇక శ్రావణమాసం వచ్చిందంటే మహిళల హడావిడి అంతా ఇంతా కాదు. పూజలు.. నోములు.. వ్రతాలు చేసే నెల శ్రావణమాసమే. ఈఏడాది (2025) విశ్వావసునామ సంవత్సరం లో జులై25 శుక్రవారం నుంచి శ్రావణమాసం ప్రారంభమవుతుంది. శ్రావణమాసం లో ఏ పండుగలు ఎప్పుడొచ్చాయో ఈ కథనంలో తెలుసుకుందాం.. దక్షిణాయంలో శ్రావణమాసానికి ఎంతో విశిష్టత ఉందని పండితులు చెబుతున్నారు. సాక్షాత్తు శ్రీమన్నారయణుడైన విష్ణుమూర్తి జన్మ నక్షత్రం శ్రవణం అనే పేరుతో శ్రావణమాసం ఉద్భవించిందని పురాణాలు చెబుతున్నాయి. అందుకే విష్ణుమూర్తి భార్య లక్ష్మీదేవికి శ్రావణమాసం అంటే ఎంతో ఇష్టమంటున్నారు పండితులు. శ్రావణ మాసం అంటే పండుగల మాసం. వర్షరుతువుతో పరిసరాలు పచ్చగా కళకళలాడే కాలం. ఇళ్లన్ని పూజాధికాలతో శోభిల్లే కాలం. అటువంటి శ్రావణ మాసంలో వచ్చే పండుగలు, నోములు, వ్రతాలతో ఇళ్లన్నీ ఆధ్యాత్మిక శోభతో నిండిపోతుంటాయి. మహిళలు పూజలు చేస్తు భక్తి నిండిన మనస్సులో ఉంటారు. మహిళలు కళకళలాడుతుంటే ఆ ఇల్లే సౌభాగ్యాలతో వర్ధిల్లుతుందంటారు. కాబట్టి శ్రావణ మాసం అంటే పూజలే కాదు ఆనందాల కాలం. లక్ష్మీదేవి ఇళ్లల్లో కొలువుండే మాసం. ఆమెకు అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణమాసం. అందుకే వ్రతాలు, నోములు నోచుకునే మహిళలు శ్రావణమాసంలో నిర్వహించుకుంటారు. శ్రావణమాసం మొత్తం పండుగలే పండుగలు. మొదటి 15 రోజుల్లో వరలక్ష్మీ వ్రతం, నాగపంచమి, రాఖీ పౌర్ణమి వస్తే..పౌర్ణమి తర్వాత వచ్చే పాడ్యమి నుంచి అమావాస్య వరకూ కూడా ప్రత్యేక రోజులే ఉంటాయని పండితులు చెబుతున్నారు.

**శ్రావణమాసం పండుగల వివరాలు ఇవే..!**

జులై 25: మొదటి శ్రావణ శుక్రవారం
జులై 29: మొదటి శ్రావణ మంగళవారం
ఆగష్టు 01 : రెండో శ్రావణ శుక్రవారం
ఆగష్టు 03 : ఫ్రెండ్ షిప్ డే
ఆగష్టు 05 : శ్రావణ మంగళవారం
ఆగష్టు 08 : మూడో శ్రావణ శుక్రవారం , వరలక్ష్మీ వ్రతం
ఆగష్టు 09 : జంధ్యాల పౌర్ణమి... రాఖీ పండుగ
ఆగష్టు 12 : మూడో శ్రావణ మంగళవారం
ఆగష్టు 15 : నాలుగో శ్రావణ శుక్రవారం
ఆగష్టు 16: కృష్ణాష్టమి
ఆగష్టు 19 : నాలుగో శ్రావణ మంగళవారం
ఆగష్టు 22: ఆఖరి శ్రావణ శుక్రవారం
ఆగష్టు 23 : శనివారం పోలాల అమావాస్య తో శ్రావణమాసం ఆఖరి రోజు
ఆగష్టు 24: ఆదివారం నుంచి బాధ్రపదమాసం ప్రారంభం...

# ఎట్లుండె తెలంగాణ ఎట్ల అయ్యింది

## ఏనాడైనా ఎరువుల కోసం లైన్లలో నిలబడ్డారా?

- రుణమాఫీ చేసింది 30 పైసలైతే.. ఎగ్గొట్టింది 70 పైసలు
- ఏపీలో ఎకరా కొనాలంటే తెలంగాణలో పదెకరాలు అమ్మే పరిస్థితి
- గురుకులాల దీనస్థితి రేవంత్ రెడ్డికి కనబడటం లేదా?
- కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

**గజ్వేల్, మహా:** కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం రెండేళ్లలోనే ఆగమాగమైందని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పాలన చేతగాక, దిక్కుమాలిన మాటలు చెబుతూ, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం ప్రజ్ఞాపూర్‌లోని ఎస్‌ఎల్‌ఎన్ కన్వెన్షన్‌లో గజ్వేల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 'ఇటీవల నిర్వహించిన సర్వేల ప్రకారం, రాష్ట్రంలోని 31 జిల్లా పరిషత్‌లలో 16 నుంచి 18 పరిషత్‌లను బీఆర్‌ఎస్ సొంతం చేసుకోబోతోంది. సిద్ధిపేట జిల్లాలో 26 మండలాలు ఉంటే, మెజార్టీ మండలాల్లో గెలవాల్సిన అవసరం ఉంది. అందరం కలిసి ఒక కుటుంబంలా పని చేయాలి. ఆత్మవిశ్వాసం ఉండాలి కానీ, అతివిశ్వాసం పనికిరాదు" అని హరీశ్ రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, "ఎట్లుండె తెలంగాణ ఎట్ల అయ్యింది అనేది ప్రజలకు అర్థమయ్యేటట్లు చెప్పాలి. ఆరోజు నీళ్ళు ఎట్లా వచ్చాయి, ఈరోజు మంచి నీళ్లు ఎట్లా వస్తున్నాయి" అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఇంటింటికీ వచ్చి చెత్త తీసుకెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ దిక్కు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**కేసీఆర్ లక్షా 68 వేల ఉద్యోగాలు ఇచ్చారు..**

ఉద్యోగాల హామీల విషయంలో రేవంత్ రెడ్డి మాట తప్పారని హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. 'మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు అని మాట తప్పిండు. 12 వేల ఉద్యోగాలు ఇచ్చి, 60 వేలు ఇచ్చినం అని అబద్ధాలు ప్రచారం చేసుకుంటున్నారు. కేసీఆర్ లక్షా 68 వేల ఉద్యోగాలు ఇచ్చారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడానికి అశోక్ నగర్‌లోని విద్యార్థులు, నిరుద్యోగులు సిద్ధమయ్యారు" అని హెచ్చరించారు. పింఛన్ల పెంపు విషయంలోనూ ప్రభుత్వం మోసం చేసిందని హరీశ్ రావు దుయ్యబట్టారు. యూరియా కోసం పాస్ పుస్తకాలు, చెప్పులు లైన్లో




పెట్టాల్సిన దుస్థితి. బీఆర్‌ఎస్ పాలనలో ఏనాడైనా ఎరువుల కోసం లైన్లలో నిలబడ్డారా? కాంగ్రెస్ వచ్చింది మళ్లీ రైతులకు తిప్పలు మొదలయ్యాయి. కరోనా వచ్చినా కూడా కేసీఆర్ గారు రైతు బంధు ఆపలేదు. 11 విడతల్లో రూ. 73 వేల కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో వేశారు కేసీఆర్" అని గుర్తు చేశారు. భూముల ధరల పతనంపై కూడా హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు.

**గురుకుల వ్యవస్థ చిన్నా భిన్నం..**

అంతకుముందు రాష్ట్రంలోని గురుకులాల పరిస్థితిపై హరీశ్‌రావు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రతిపక్షాలపై నోరు పారేసుకునే సీఎం రేవంత్ రెడ్డికి గురుకులాల దీనస్థితి కనబడటం లేదా ప్రశ్నించారు. నారాయణఖేడ్ మోర్గి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌పై స్పందించిన ఆయన కేసీఆర్ గుర్తులు చెరిపివేయాలని రేవంత్ రెడ్డి గురుకుల వ్యవస్థను చిన్నా భిన్నం చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. గురుకుల విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



# ఆస్పత్రిలో చేరిన సీఎం స్టాలిన్

## అస్వస్థతతో అపోలో ఆస్పత్రిలో చేరిక

**తమిళనాడు, మహా:** తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు చెన్నైలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం సీఎం స్టాలిన్ వాకింగ్‌కి వెళ్లారు. ఆ సమయంలో ఆయనకు తల తిరిగినట్లు అయింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆయనను వారు ఆసుపత్రికి తీసుకెళ్లారు. సీఎం స్టాలిన్‌కు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అపోలో ఆసుపత్రి యాజమాన్యం ఓ ప్రకటనలో వెల్లడించింది. తండ్రి స్టాలిన్ ఆరోగ్యంపై ఉదయనిధి స్టాలిన్ స్పందించారు. తన తండ్రి, ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోగ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పార్టీ నేతలు, కార్యకర్తలకు ఉదయనిధి స్టాలిన్ సూచించారు.


# హెచ్‌సీఏ అక్రమాల్లో కేటీఆర్, కవిత ప్రమేయం

## టీసీఏ కార్యదర్శి గురవారెడ్డి సంచలన ఆరోపణలు

### పదేళ్ల పాటు రాష్ట్ర క్రికెట్ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారు

### చాలామంది క్రికెటర్లకు గుర్తింపు లేకుండా చేశారు

### కేటీఆర్, కవిత, సంపత్ కుమార్‌లను విచారించాలని డిమాండ్



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అక్రమాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత ప్రమేయం ఉందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) కార్యదర్శి గురువారెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పదేళ్ల పాటు రాష్ట్ర క్రికెట్ వ్యవస్థను వారు గుప్పిట్లో పెట్టుకున్నారని మండిపడ్డారు. చాలామంది క్రికెటర్లకు గుర్తింపు లేకుండా చేశారని విమర్శించారు. హెచ్‌సీఏ అక్రమాలకు సంబంధించి కేటీఆర్, కవిత, సంపత్ కుమార్‌లను విచారించాలని ఆయన డిమాండ్ చేశారు. వీరి తప్పుడు నిర్ణయాల వల్ల గ్రామీణ క్రికెటర్లకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వచ్చిన డబ్బులు ఎక్కడికి పోయాయని ఆయన ప్రశ్నించారు. హెచ్‌సీఏలో బీసీసీఐ రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని తెలిపారు. గురువారెడ్డి గతంలోనూ కేటీఆర్, కవితలపై ఆరోపణలు చేశారు

''కేటీఆర్, కవితతో పాటు హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంపత్‌కుమార్‌ను తక్షణమే విచారించాలి. వారి తప్పుడు నిర్ణయాల వల్ల గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం జరిగింది. సమ్మర్ క్యాంపులను ఉచితంగా నిర్వహించాలి కానీ డబ్బులు తీసుకున్నారు. దానికి మా వద్ద ఆధారాలున్నాయి. ఆ డబ్బంతా ఎక్కడికి పోయింది. అవకాశాల కోసం తెలంగాణ క్రికెటర్లు ఎదురుచూస్తున్నారు. హెచ్‌సీఏలో జరిగిన అక్రమాల వివరాలను సీఐడీ, ఈడీకి అందజేస్తాం. హెచ్‌సీఏ కార్యవర్గాన్ని రద్దు చేయాలి. హెచ్‌సీఏ ఎన్నికపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. క్రికెట్‌తో సంబంధం లేని జగన్మోహన్‌రావు ఎలా అధ్యక్షుడు అయ్యారు? ఆయన వెనుక కేటీఆర్, కవిత ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎలా ఓట్లు వేస్తారు? ఐపీఎస్ అధికారి సజ్జనార్ కూడా ఎన్నికల్లో పాల్గొన్నారు. 155 క్రికెట్ అసోసియేషన్లు యాక్టివ్‌లో లేవు. అలాంటి వాటికి ఎన్నికలు ఎలా నిర్వహించారు? వెంటనే ఎన్నికలు రద్దు చేసి క్లబ్బులను ప్రక్షాళన చేయాలి'' అని గురువారెడ్డి డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య

- జోడెద్దుల మాదిరిగా సంక్షేమం, అభివృద్ధి పరుగులు
- సన్న బియ్యం ఇవ్వడం భారతదేశ చరిత్రలో నే రికార్డు
- 9 రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రైతుబంధు పంపిణీ చేశాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మధిర, మహా:** రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా 93 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా సన్న బియ్యం కూడా పంపిణీ చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆహార భద్రత విషయంలో దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని అన్నారు. సోమవారం మధిర నియోజకవర్గం బోనకల్లులో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అత్యంత పేదలతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన మధ్యతరగతి వర్గాలకు కూడా ఇందిరమ్మ ప్రభుత్వంలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. కొత్తగా పెళ్లయిన వారు గత పదేళ్లుగా రేషన్‌కార్డులో పేరు నమోదు, కుటుంబసభ్యుల పేర్ల చేర్పులు, మార్పులు కోసం నిరీక్షించారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలుపెట్టామన్నారు. కొత్తగా పెళ్లి అయిన వాళ్ళు గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు పేరు నమోదు, కుటుంబ సభ్యుల పేర్లు చేర్పులు, మార్పుల కోసం గత పది సంవత్సరాలు కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూసిన ఫలితం కనిపించేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఒక మధిర నియోజకవర్గంలోనే కొత్తగా 13,767 మంది లబ్ధిదారులకు ఒకేరోజు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం సంతోషించదగిన అంశం అని పేర్కొన్నారు.

**రుణమాఫీ కింద 21 వేల కోట్లు..**

రేషన్ కార్డులో జారీ అనేది ఉమ్మడి రాష్ట్రంలో నిరంతర ప్రక్రియ కాగా ప్రతి సంవత్సరాలు పరిపాలించిన వారు ఈ విషయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండగా ఈ పథకం కింద రాష్ట్రంలోని 51 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పది లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం రాష్ట్రంలోని 93 లక్షల కుటుంబాలకు అందుబాటులోకి వచ్చిందని వివరించారు. ఇటీవలే తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతులకు రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో జమ చేశాం అని అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ కింద 21 వేల కోట్లు రైతుల పక్షాన బ్యాంకులకు చెల్లించామని వివరించారు. కేవలం సంక్షేమ కార్యక్రమాలే కాదు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోడేట్ల మాదిరిగా పరుగులు పెడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బి శాఖ ద్వారా 20వేల కోట్లతో పనులు చేపట్టామని, విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు.


# ఈడీపై సుప్రీంకోర్టు కన్నెర్ర

- రాజకీయ పోరాటాలు మీకెందుకు అని ఆగ్రహం
- కర్ణాటక హైకోర్టు తీర్పుపై పిటిషన్ ను తోసిపుచ్చిన సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ, మహా :** మైసూర్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (ముడా) భూముల అక్రమ కేటాయింపుల కేసులో దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఈ కేసుకు సంబంధించి కర్ణాటక హైకోర్టు తీర్పును ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్ ను పరిశీలించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ల ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. భూముల అక్రమ కేటాయింపుల వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతి, రాష్ట్ర మంత్రి సురేశ్ లకు జారీ చేసిన సమన్లను హైకోర్టు కొట్టివేసిందని ఈడీ గుర్తుచేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్ ను పరిశీలిస్తూ ఈ వ్యవహారంలో ఈడీ రాజకీయ పోరాటం చేస్తోందని సుప్రీం ధర్మాసనం విమర్శించింది. ఇది ముమ్మాటికీ అధికార దుర్వినియోగం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. పిటిషన్ పరిగణనలోకి తీసుకోవడంలేదని స్పష్టం చేసింది. ఈడీని రాజకీయ పోరాటాలకు ఎందుకు ఉపయోగిస్తున్నారంటూ న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ కేసు విచారణకు స్వీకరించడంపై సీజేఐ బెంచ్ అయిష్టత వ్యక్తం చేసింది.

**కోర్టు బయటే రాజకీయ యుద్ధాలు**

రాజకీయ యుద్ధాలు కోర్టు బయట చేసుకోవాలని తెలిపింది. అలాంటి పోరాటాలకు ఈడీని ఎందుకు వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. దిగువ కోర్టు, కర్ణాటక హైకోర్టు ముడా స్కామ్ కేసుకు సంబంధించి ఏకకాలంలో నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆ తీర్పును సుప్రీంకోర్టులో ఈడీ సవాల్ చేయడాన్ని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. సింగిల్ జడ్జి ట్రయల్



కోర్టు ఉత్తర్వులను సమర్థించారని ఈడీకి బాగా తెలుసన్నారు. ఎన్నికల్లో రాజకీయ యుద్ధాలు చేసుకోనివ్వందని, ఈడీని ఎందుకు వాడుతున్నారని ప్రశ్నించారు. "దురదృష్టవశాత్తూ మహారాష్ట్రలో నాకు అనుభవం ఉంది. దయచేసి మేము మాట్లాడేటట్లు ఒత్తిడి చేయవద్దు. ఒకవేళ అలాచేస్తే, మేము ఈడీ గురించి కఠిన విషయాలు చెప్పాల్సి ఉంటుంది." అని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు స్పందిస్తూ తాము పిటిషన్‌ను ఉపసంహరించుకొంటామని సుప్రీంకోర్టు ధర్మాసనానికి వెల్లడించారు. ఆ తర్వాత కోర్టు ఈ పిల్‌ను తిరస్కరించింది. హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి తీసుకొన్న నిర్ణయంలో ఎటువంటి లోపం లేదని స్పష్టం చేసింది.

**అసలేంటి ముడా స్కామ్?**

మైసూరు సమీపంలోని కెసరె గ్రామంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సతీమణి పార్వతికి 3 మూడు ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని ఆమె తన సోదరుడు మల్లికార్జునస్వామి 2010లో బహుమతిగా ఇచ్చారు. అయితే అభివృద్ధి పనుల్లో భాగంగా ముడా ఆ ల్యాండ్ స్వాధీనం చేసుకుని, పరిహారంగా 2021లో విజయనగర ప్రాంతంలో 38,283 చదరపు అడుగుల ప్లాట్లను ఇచ్చింది. కెసరెలోని భూమితో పోలిస్తే విజయనగరలో ల్యాండ్ మార్కెట్ ధర చాలా ఎక్కువ. ఈ కుంభకోణం మొత్తం విలువ మూడు వేల కోట్ల నుంచి నాలుగు వేల కోట్ల రూపాయల వరకు ఉంటుందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. ఈ క్రమంలో సిద్ధరామయ్య భార్య పార్వతికి ఈడీ సమన్లు జారీ చేసింది. ఈ సమన్లను కర్ణాటక హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ ఎం. నాగప్రసన్న క్వాష్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ఈ తీర్పును ఈడీ సుప్రీంలో అప్పీల్ చేయగా ఎదురుదెబ్బ తగిలింది. దర్యాప్తు సంస్థపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది.

**మరో కేసులోనూ ఈడీకి ఎదురుదెబ్బ**

మరోవైపు, కేసు దర్యాప్తు సమయంలో కక్షిదారులకు చట్టపరమైన సలహాలిచ్చే న్యాయవాదులకు విచారణ సంస్థలు సమన్లు జారీచేయడాన్ని సుమోటోగా స్వీకరించిన న్యాయస్థానం సోమవారం విచారణ జరిపింది. ఈ క్రమంలో ఈడీ చర్యలు న్యాయవాద వృత్తిపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయని సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ ధర్మాసనానికి తెలిపారు. అలాగే అంతర్జాతీయ ఉదాహరణలను ప్రస్తావించారు. తుర్కియేలో మొత్తం బార్ అసోసియేషన్ రద్దు అయ్యిందని, చైనాలో కూడా ఇలాంటి పరిస్థితులే చూశామన్నారు. భారత్ అలాంటి దిశలో వెళ్లకూడదని, కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించాలని సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని కోరారు. ఈ కేసుపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. "న్యాయవాది ఇచ్చిన సలహా తప్పు అయినప్పటికీ, అతనికి ఎలా సమన్లు జారీ చేస్తారు. ఈ విషయంపై కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించాలి. జోక్యాలను క్రోడీకరించడానికి కోర్టు ఒక అమికస్ క్యూరీని నియమిస్తుంది. రాబోయే వారంలో ఈ కేసును విచారిస్తుంది." అని సీజేఐ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. కాగా ఓ వ్యక్తి హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని ఎలా దాచాలని సీనియర్ న్యాయవాదులు అరవింద్ దతార్, ప్రతాప్ వేణుగోపాల్ న్యాయ సలహా కోరినట్లు ఆరోపణలు రావడంతో వారికి ఈడీ సమన్లు జారీచేసింది. ఈ క్రమంలో కోర్టు విచారణ జరిపింది.

Z కేటగిరీ

# ప్రజాతీర్పు, కేసీఆర్‌కు తమాషాగా ఉందా?

**ఏది మంచో,ఏది చెడో తండ్రీ,కొడుకులు చెబితే తప్ప తెలుసుకునే పరిస్థితిలో జనం లేరు.' ప్రజలకు మించిన గొప్ప ఉపాధ్యాయుడు మరొకరు లేరు' అని మావో అన్నాడు. ''తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు" అని కేసీఆర్ ఎన్నిసార్లు చెప్పారో గుర్తు లేదు.ఆయనకున్నంత 'పదవీ వ్యామోహం' మరెవరికీ లేదని తెలంగాణ ప్రజానీకానికి తెలుసునని కాంగ్రెస్ పార్టీ నాయకులంటుంటారు.**



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

''కొన్నిసార్లు తమాషాలు జరుగుతుంటాయి.ఎన్నికల్లో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. బీఆరెస్ ప్రస్థానం ఆగేది కాదు.కొంతమంది పార్టీని వీడినంత మాత్రాన నష్టం లేదు.బీఆర్ఎస్‌కు బుల్లెట్ల వంటి కార్యకర్తలున్నారు. వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందాం.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు అనూహ్యంగా మోసపోయారు.పాలిచ్చే బర్రెను వొదిలి దున్నపోతును తెచ్చుకున్నట్టు అయిందని పల్లెల్లో ప్రజలు బాధపడుతున్నారు'' అని ఎర్రవెల్లి ఫాం హౌస్‌లో తనను కలిసిన పార్టీ కార్యకర్తలతో బీఆరెస్ అధినేత కేసీఆర్ కొన్ని నెలల కిందట అన్నారు.''బిర్యానీకి ఆశపడి జనం,అన్నం పోగొట్టుకున్నారు. తప్పు చేసినందుకు ఐదేండ్ల శిక్ష అనుభవిస్తున్నారు.' బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జూలై 18 న ఖమ్మం మీడియా సమావేశంలో అన్నారు.తండ్రీ,కొడుకులిద్దరూ 'ప్రజల్ని తప్పుబట్టడం' ఇదే మొదటిసారి కాదు,చివరిసారి అంతకన్నా కాదు.

మరో మూడున్నరేండ్ల పాటు ఈ 'థియరీ' నే పకడ్బందీగా జనంలోకి తీసుకువెళ్లాలని ఇద్దరూ అనుకుంటున్నారు.వారికి తోడుగా హరీశ్ రావు,జీ.జగదీశ్ రెడ్డిలతో పట్టు మరికొందరు ఉండనే ఉన్నారు.కేసీఆర్,కేటీఆర్ చెబుతున్నారు కనుక అది నిజమనీ,అదే నిజమనీ నమ్మే పార్టీ శ్రేణులు,నాయకులు కోకొల్లలు.'కాంగ్రెస్ పార్టీ ప్రజల్ని మోసం చేసింది.తప్పుడు హామీలకు ప్రజలు మోసపోయారు' అనే సిద్ధాంతం ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతుందని,తమకు సొంత బుర్ర లేదా? సొంతంగా ఆలోచించే తెలివి లేదా? అని జనం మాట్లాడుకుంటారని బిఆర్ఎస్ నాయకత్వం భావించడం లేదు.తమకు ఓటు వేయనందున జనమంతా వెర్రి మాలోకం అనీ ,అందుకు తగిన శాస్తి జరిగిందనీ కేసీఆర్,కేటీఆర్ ఒక 'థియరీ'ని రూపొందించడమే ఆశ్చర్యంగా ఉన్నది.ఏది మంచో,ఏది చెడో తండ్రీ,కొడుకులు చెబితే తప్ప తెలుసుకునే పరిస్థితిలో జనం లేరు.'ప్రజలకు మించిన గొప్ప ఉపాధ్యాయుడు మరొకరు లేరు' అని మావో అన్నాడు. మావో కాలిగోటికి కూడా సరిపోనందున రాజకీయ నాయకులు ప్రజల్ని అవహేళన చేస్తున్నారు.

''తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు" అని కేసీఆర్ ఎన్నిసార్లు చెప్పారో గుర్తు లేదు.ఆయనకున్నంత 'పదవీ వ్యామోహం' మరెవరికీ లేదని తెలంగాణ ప్రజానీకానికి తెలుసునని కాంగ్రెస్ పార్టీ నాయకులంటుంటారు. ''పార్టీ నాయకులను సృష్టిస్తుంది.నాయకులు పార్టీలోకి వచ్చి పోతుంటారు.కొంతమంది నాయకులు బీఆరెస్‌ను వీడినంత మాత్రాన పార్టీకి ఎటువంటి తేడా రాదు.కార్యకర్తలనే నాయకులుగా తీర్చిదిద్దుకుందాం. బీఆర్ఎస్ పార్టీ బీ ఫామ్ ఇచ్చి అవకాశమిస్తే ఎవరైనా సిపాయిలుగా తయారవుతారు''.అని కేసీఆర్ తమ పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడారు.ఆయన వ్యాఖ్యలు వింటున్నప్పుడే సదరు నాయకులకు చిర్రెక్కిందని సమాచారం.నాయకులను తయారుచేసుకోగలిగిన సామర్థ్యం పార్టీ నాయకత్వానికి,అంటే కేసీఆర్ కు ఉండి ఉంటే కాంగ్రెస్,టీడీపీ,సిపిఐ వంటి పార్టీల నుంచి ఎమ్మెల్యేలను,నాయకులను పెద్దఎత్తున ఎందుకు చేర్చుకున్నట్టు? వలసలను భారీగా ఎందుకు ప్రోత్సహిస్తూ వచ్చినట్టు?అని వారిలో చర్చ జరుగుతున్నది.కనుక కేసీఆర్ మాటలకు,చేతలకు పొంతన లేదని సొంత పార్టీ నాయకులకు తెలిసిందే.కానీ కేసీఆర్ ఎదుట పల్లెత్తు మాట అనలేని నిస్సహాయత లేదా బలహీనత.

పదేళ్ళపాటు తెలంగాణ ముఖ్యమంత్రిగా అహంకారపూరితమైన అధికారాన్ని చెలాయించిన కేసీఆర్‌ను,ఆయన పార్టీని ప్రజలు ఇంటికి సాగనంపారు. దారుణమైన ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని,ఆత్మవిమర్శ చేసుకుని,పద్ధతులలో మార్పులు చేసుకుంటే వచ్చే ఎన్నికలలో కేసీఆర్ కు మళ్ళీ ప్రజాదరణ లభిస్తే లభిస్తుందేమో!.అయితే కేసీఆర్ గానీ,ఆయన పార్టీలోని వ్యక్తులుగానీ తమ పాత ధోరణి మార్చుకునేందుకు సిద్ధంగా లేరు.''తమను ఇంటికి పంపించి తప్పు చేశామని ప్రజలు భావిస్తున్నార''ని కేసీఆర్ 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఒక టీవీ న్యూస్ ఛానల్ లో వ్యాఖ్యానించడాన్ని బట్టి ఆయన అహంకారం తీవ్రత బయటపడింది.

1989లో ఎన్టీఆర్ ను కూడా ప్రజలు ఓడించారు. తనకు తిరుగేలేదని అప్పటి వరకూ భావిస్తూ వచ్చిన ఎన్టీఆర్ ప్రజలు ఇచ్చిన తీర్పుతో షాకయ్యారు.అయినప్పటికీ, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని,తనను తాను మార్చుకున్నారు.అంతే తప్ప ప్రజలను ఏనాడూ తారకరామారావు నిందించలేదు. ఎన్టీఆర్ ఆశీస్సులతోనే రాజకీయాల్లో రాణించిన కేసీఆర్,ఎన్టీఆర్ నుంచి ఈ గుణాన్ని నేర్చుకోలేదు.పదేళ్ళ కేసీఆర్ అధికారాన్ని పీకి అవతల పారేసిన రేవంత్ రెడ్డి ఇప్పటికీ కేసీఆర్ కు అంగుష్టమాత్రుడిగానే కనిపిస్తున్నారు.ఇప్పటికీ తనను తాను హిమాలయాలంత ఎత్తున ఉన్నట్టుగానే కేసీఆర్ ఊహించుకుంటున్నారు.తాను పదేళ్ళపాటు అద్భుతమైన పరిపాలన అందించినట్టే భావిస్తున్నారు. తాను తీసుకున్న నిర్ణయాలన్నీ చాలా గొప్పవనే భావిస్తున్నారు.మేడిగడ్డ కుంగిపోవడం చాలా చిన్న విషయంగానే భావిస్తున్నారు.

భవిష్యత్తులో కేసీఆర్ కుటుంబం,ఆయన కుటుంబానికి విధేయంగా పడివుండేవారు తప్ప మరెవరూ ఆ పార్టీలో వుండే అవకాశాలు కనిపించడం లేదని పరిశీలకులు అంటున్నారు.ఇలాంటి వాస్తవ పరిస్థితులకు భిన్నమైన విధంగా కేసీఆర్ వాదన వుంది. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళిన నాయకులు తనకు ఫోన్ చేసి,అనవసరంగా బీఆర్ఎస్ ను వదిలి వెళ్ళామని బాధపడుతున్నట్టు కూడా కేసీఆర్ ప్రచారం చేసుకుంటున్నారు.కేసీఆర్ అధికారంలో వున్నప్పుడు పార్టీలో ఎమ్మెల్యేలు,ఎంపీల ఫోన్ లను కేసీఆర్ ఎత్తలేదు.కేటీఆర్ ఎత్తలేదు.వాళ్ళ పీఏలు,పీఎస్ లు కూడా పార్టీ ముఖ్యుల కాల్స్ ఎత్తిన ఆనవాళ్లు లేవు. ఇప్పుడు పార్టీని వీడి బయటకు వెళ్ళిన ఎమ్మెల్యేలు ఫోన్ చేయడం,కేసీఆర్ ఆ కాల్స్ కు స్పందించడం నమ్మశక్యం కానిది.కాంగ్రెస్ పార్టీలో వున్న 20 నుంచి 25 మంది ఎమ్మెల్యేలు కేసీఆర్ తో టచ్‌లో వున్నట్లు, వాళ్ళంతా బీఆర్ఎస్ కు మద్దతు ఇస్తున్నట్టు, కాంగ్రెస్ నుంచి వెలుపలికి వచ్చి బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు 2024 ప్రారంభంలో ఒక ప్రచారాన్ని కొంతకాలం నడిపారు.

బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకవర్గ సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు.అతి త్వరలోనే రాష్ట్రంలో ఉపఎన్నికలు కూడా రానున్నాయని జోస్యం చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ పగటికలలు కంటున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. ఫార్మ్ హౌస్‌లోనే ఉండటంతో ఆయనకు బయట ఏం జరుగుతుందో తెలియడం లేదని,అందుకే ఇలా మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యంతో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని,బీఆర్ఎస్ ఊసు కూడా ఎక్కడా వినిపించడం లేదని మంత్రి అన్నారు.

కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్ అనే విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి.ఎన్నికలప్పుడు మాత్రమే ఆయనకు ప్రజలు గుర్తుకొస్తారని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నందున కేసీఆర్ ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తారని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులంటున్నారు.మేడిగడ్డ కుంగినప్పుడు గాని, రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు గాని ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కు ప్రజలు గుర్తుకురాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేల విమర్శ.శాసనసభలో కీలకమైన తీర్మానాలు,కులగణన,ఎస్సీవర్గీకరణ,భూభారతి బిల్లు,తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానానికి కూడా కేసీఆర్ హాజరుకాలేదని కాంగ్రెస్ మంత్రులు గుర్తు చేస్తున్నారు.

కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని తిరోగమనదిశలోకి తీసుకెళ్లారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు శ్రీధర్ బాబు,ఉత్తమ్,భట్టి,కోమటిరెడ్డి,పొన్నం ప్రభాకర్,సీతక్క పలు సందర్భాల్లో ఆరోపించారు. పదేళ్లలో ఆయన చేసిన నిర్వాకాలను తప్పులను ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ 18నెలల్లో తాము సాధించిన అభివృద్ధిని సవివరంగా కేసీఆర్ ముందుంచడానికి సిద్ధంగా ఉన్నట్టు సీఎం తెలిపారు.ఆయన అసెంబ్లీకి హాజరు అయితే అన్ని అంశాలపై సుదీర్ఘంగా చర్చించవచ్చునని రేవంత్ అంటున్నారు.''విపరీతమైన అప్పులు చేసి నెత్తినమీద మిత్తిల భారం పెట్టిపోయారు.పదేళ్లలో కేసీఆర్ చేసిన అప్పులకు తెలంగాణ సమాజం ఆయనను ఎన్నటికీ క్షమించదు.కేసీఆర్ కుటుంబాన్ని వదిలిపెట్టేది లేదు'' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ,ఇందిరమ్మ ఇండ్లు,ఉచిత విద్యుత్,అరవై వేల ఉద్యోగాలు,రైతు భరోసా,రుణమాఫీ అమలు,ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వంపై సానుకూల వాతావరణం ఏర్పడడానికి కారణమవుతున్నవి.

పార్లమెంట్ శాసనసభ ఎన్నికల్లో దారుణమైన పరాభవం నేపథ్యంలో ప్రజలలో కోల్పోయిన పట్టును సాధించడానికి భారత రాష్ట్ర సమితి శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తోంది.సోషల్ మీడియాలో ప్రధాన ప్రతిపక్షం స్వైర విహారం అంతు లేకుండా పోతున్నది. వందల కొద్ది యూట్యూబ్ చానల్స్,వెబ్ సైట్ లు,ట్విట్టర్ హ్యాండిల్స్ బిఆర్ఎస్ కోసం పనిచేస్తున్నట్టు ఒక ప్రచారం ఉంది. కాంగ్రెస్ పార్టీని నిరంతరం ఆత్మరక్షణలో పడవేయడానికి సామాజిక మాధ్యమాల ద్వారా బిఆర్ఎస్ ప్రయత్నిస్తోంది.వీటికి గట్టిగా కౌంటర్ ఇవ్వడంలో అధికార కాంగ్రెస్ పార్టీ విఫలమవుతున్నట్టు కనిపిస్తోంది.సోషల్ మీడియాపై కేటీఆర్,ఆయన వందిమాగధులు తీవ్రంగా ఆధారపడ్డారు.అయితే ఆ పార్టీ లైన్ ప్రజల్లోకి నెగిటివ్ గా వెడుతున్న విషయాన్ని గ్రహించడం లేదు.

కెసిఆర్ ను ఉద్దేశించి ఆయన కుమార్తె సంధించిన ప్రశ్నలను తెలుగు మీడియా ప్రముఖంగా ప్రస్తావిస్తోంది.ఈ లేఖల విషయాన్ని బిఆర్ఎస్ హైకమాండ్ పక్కన బెట్టింది.పార్టీ అనుకూల సోషల్ మీడియా విభాగం కూడా దీనిని పూర్తిగా విస్మరించింది.కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రాసిన లేఖలోని ప్రశ్నలకు సరయిన జవాబు చెప్పవలసిన బాధ్యత పార్టీ హైకమాండ్ పై ఉన్నట్టు తెలంగాణ పౌర సమాజం భావిస్తోందో.పార్టీ 25 సంవత్సరాల వేడుకలో బిజెపిపై కెసిఆర్ నోరు మెదపకపోవడం, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ ఇప్పటివరకు కేంద్రంలోని బిజెపిపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.ముఖ్యంగా ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత అరెస్టు అయిన నాటి నుంచి బిజెపి నాయకులను బిఆర్ఎస్ నాయకులు పెద్దగా టార్గెట్ చేసిన దాఖలాలు లేవు.

సోషల్ మీడియాలో కేటీఆర్ ప్రశ్నించడం తప్ప పార్టీ వైపు నుంచితగిన స్పందన లేదు.తాజాగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఎపిసోడ్ లోనూ కవితకు బిఆర్ఎస్ నుంచి మద్దతు కరువయింది.'సామాజిక తెలంగాణ సాధించుకోలేకపోయామ'ని కవిత గతంలో చేసిన వ్యాఖ్యలు,బీసీ రిజర్వేషన్లపై తమ పార్టీ విధానాన్ని తప్పుబట్టడంతో గందరగోళం నెలకొన్నది.సాధారణంగానే ఎవరు ప్రశ్నించినా కెసిఆర్ తట్టుకోలేరు. అలాంటిది సొంత బిడ్డ ఇలా ప్రశ్నిస్తే ఆయన మాత్రం ఎలా ఊరుకుంటారు?అందువల్లే ఆమెను దూరం పెట్టారని ప్రచారం జరుగుతోంది.బిజెపితో విలీనానికి బిఆర్ఎస్ కుట్ర చేస్తోందని కవిత చేసిన ఆరోపణలనూ కేసీఆర్ ఖండించడం లేదు.

పదేళ్ళపాటు అప్రజాస్వామికంగా తెలంగాణ రాష్ట్రం నెత్తిన బిఆర్ఎస్ పార్టీ కుటుంబ పాలనను రుద్ది,రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసిందని మరలా వాళ్లకు ప్రజల అభిమానం లభించే అవకాశాలు లేవని సీనియర్ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. అధికారం రుచిమరిగి, అది శాశ్వతమని భ్రమించి,తన కోడీ, తన కుంపటీ లేకపోతే తెల్లారబోదనుకున్న ముసలమ్మలాగే ఇక తెలంగాణకు తామే దిక్కని వారు భావించారని,ఆ క్రమంలో తమకు అధికారం కట్టబెట్టింది ప్రజలేనన్న అసలు వాస్తవాన్ని వారు మరచారని మంత్రి విమర్శించారు. అందుకే తెలివైన,చైతన్యవంతులైన తెలంగాణ ఓటర్లు చిత్తుచిత్తుగా ఓడించి ప్రతిపక్షస్థానంలో కూర్చోబెట్టారని శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. .

కాగా తమ రాజకీయ లక్ష్య సాధన కోసం అవసరమైనప్పుడల్లా తమ అమ్ములపొదిలోంచి సెంటిమెంట్ అస్త్రాన్ని బయటికి తీసి ప్రయోజనం పొందటానికి బిఆర్ఎస్ పరివారం అలవాటు పడ్డారు.అందుకే నేటికీ తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ నుంచి, ప్రత్యేకించి చంద్రబాబు నుంచి ఏదో ముప్పు ఉందని వాళ్ళు జనాన్ని భయపెట్టి రెచ్చగొట్టటం పరిపాటైంది.అధికారం తమ చేజారిపోయేసరికి వారు తెలంగాణ ఉనికికే ఏదో ప్రమాదం ఏర్పడినట్లు గగ్గోలు పెడుతున్నారు.తమ పదేళ్ళ పాలనలో కాళేశ్వరం నిర్మాణ అక్రమాలు,ఫోన్ టాపింగ్ వంటి నేరాలు - ఘోరాలు ఒక్కొక్కటిగా బయటపడుతుంటే కెసిఆర్ అండ్ కో బెంబేలెత్తి పోతున్నది.అందుకే తమకు అవరమైనప్పుడల్లా తిరిగి ప్రాంతీయ చిచ్చును ఎగదోయడానికి పథకాలు రచిస్తున్నట్టు తెలుస్తోంది.

తెలంగాణ ఉద్యమం మంచి ఊపులో ఉండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగాలు,వ్యాపారాలు చేసుకుంటూ స్థిరపడిన సాటి తెలుగువారిని అత్యంత నీచంగా లంకలో పుట్టినవాళ్ళంతా రాక్షసులే ! ఆంధ్రాలో పుట్టినవాళ్ళంతా తెలంగాణ ద్రోహులే ! తెలంగాణను దోచుకోవాలని చూసేవారే ! ఇన్ని తిట్టిపోశారు.తనను అందరూ తెలంగాణ జాతిపిత గా గుర్తించాలని కేసీఆర్ బలంగా కోరుకుంటున్నారు. తెలంగాణ ఏర్పడక ముందూ,ఆ తరువాత కూడా ఆంధ్ర ప్రాంతం వారిని తెలంగాణ ద్రోహులుగా ముద్ర వేయడం 'అవసరమయినపుడల్లా' కెసిఆర్ అండ్ కో కు అలవాటుగా మారింది.

భారత రాజ్యాంగంలోని 19 వ అధికరణం ప్రకారం పౌరులెవరైనా,భారత భూభాగంలో తాము కోరుకున్న ఏ ప్రదేశంలోనైనా స్వేచ్చగా తిరగవచ్చు,స్థిర నివాసం ఏర్పరచుకోవచ్చు.తాము కోరుకున్న వృత్తి,వ్యాపారాలు,ఉద్యోగాలు చేస్తూ ఉపాధి పొందవచ్చు. తెలంగాణలో నివసించటానికి బీఆరెస్ అనుమతిపత్రాలు అవసరం లేదు.ఇది ప్రజాస్వామ్యదేశమనీ,పౌరులంతా రాజ్యాంగ రక్షణలో ఉన్నారనే స్పృహ లేకుండా కెసిఆర్ అండ్ కో తమకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడినప్పుడల్లా ఏపీని ముగ్గులోకి లాగి సెంటిమెంటును రాజేయటం, దాడుల ద్వారా ప్రత్యర్థి పార్టీలను,మీడియానూ భయపెట్టాలని చూడటం మరెంతకాలమో సాగదని గ్రహిస్తే మంచిది.

తెలంగాణలో ఏదైనా పత్రిక లేక ఛానెల్ నడపాలంటే దాని పేరులో 'నమస్తే తెలంగాణ', 'మన తెలంగాణ', 'నవ తెలంగాణ' అనే రీతిలో తెలంగాణ శబ్దమే తప్ప ' ఆంధ్ర' అనే శబ్దమే ఉండరాదట ! 'ఆంధ్రజ్యోతి' పేరులో 'ఆంధ్ర' శబ్దం తీసెయ్యాలని బిఆర్ఎస్ ప్రాయోజిత మేధావులు సమావేశమయి 'ఫత్వా' జారీ చేశారు.'ఆ నలుగురి' పదేళ్ళ ఏకపక్ష కుటుంబ పాలన దుష్ఫలితాలను, దోపిడీని తెలంగాణ ప్రజలంతా చవిచూసి,సహించినన్నాళ్ళు కెసిఆర్ నియంత పోకడలను జనం ఓర్పుగా సహించారు. సరైన సమయంలో నిర్ణయం తీసుకుని రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకున్నారని విశ్లేషకులంటున్నారు. తాను చేసిన చారిత్రక తప్పిదాలకు కేసీఆర్ తగిన మూల్యం చెల్లించారు. ఎన్నికలు రేపు జరుగుతాయనగా కూడా కృష్ణా నదీజలాల వివాదం మరోసారి తెరపైకి తెచ్చి భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు జగన్ రెడ్డి సహకారంతో వారు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు.



> “ కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్ అనే విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి.ఎన్నికలప్పుడు మాత్రమే ఆయనకు ప్రజలు గుర్తుకొస్తారని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నందున కేసీఆర్ ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తారని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులంటున్నారు.మేడిగడ్డ కుంగినప్పుడు గాని,రాష్ట్రంలో భారీ వర్షా లు, వరదలు వచ్చినప్పుడు గాని ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కు ప్రజలు గుర్తుకురాలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేల విమర్శ. శాసనసభలో కీలకమైన తీర్మానాలు, కులగణన, ఎస్సీ వర్గీకరణ, భూభారతి బిల్లు,తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానానికి కూడా కేసీఆర్ హాజరుకాలేదని కాంగ్రెస్ మంత్రులు గుర్తు చేస్తున్నారు.

> “ పార్లమెంట్ శాసనసభ ఎన్నికల్లో దారుణమైన పరాభవం నేపథ్యంలో ప్రజలలో కోల్పోయిన పట్టును సాధించడానికి భారత రాష్ట్ర సమితి శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తోంది.సోషల్ మీడియాలో ప్రధాన ప్రతిపక్షం స్వైర విహారం అంతు లేకుండా పోతున్నది. వందల కొద్ది యూట్యూబ్ చానల్స్,వెబ్ సైట్ లు,ట్విట్టర్ హ్యాండిల్స్ బిఆర్ఎస్ కోసం పనిచేస్తున్నట్టు ఒక ప్రచారం ఉంది. కాంగ్రెస్ పార్టీని నిరంతరం ఆత్మరక్షణలో పడవేయడానికి సామాజిక మాధ్యమాల ద్వారా బిఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. వీటికి గట్టిగా కౌంటర్ ఇవ్వడంలో అధికార కాంగ్రెస్ పార్టీ విఫలమవుతున్నట్టు కనిపిస్తోంది.

> “ కెసిఆర్ ను ఉద్దేశించి ఆయన కుమార్తె సంధించిన ప్రశ్నలను తెలుగు మీడియా ప్రముఖంగా ప్రస్తావిస్తోంది.ఈ లేఖల విషయాన్ని బిఆర్ఎస్ హైకమాండ్ పక్కన బెట్టింది. పార్టీ అనుకూల సోషల్ మీడియా విభాగం కూడా దీనిని పూర్తిగా విస్మరించింది.కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రాసిన లేఖలోని ప్రశ్నలకు సరయిన జవాబు చెప్పవలసిన బాధ్యత పార్టీ హైకమాండ్ పై ఉన్నట్టు తెలంగాణ పౌర సమాజం భావిస్తోంది.

> “ పార్టీ 25 సంవత్సరాల వేడుకలో బిజెపిపై కెసిఆర్ నోరు మెదపకపోవడం, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ ఇప్పటివరకు కేంద్రంలోని బిజెపిపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. ముఖ్యంగా ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత అరెస్టు అయిన నాటి నుంచి బిజెపి నాయకులను బిఆర్ఎస్ నాయకులు పెద్దగా టార్గెట్ చేసిన దాఖలాలు లేవు.

> “ సోషల్ మీడియాలో కేటీఆర్ ప్రశ్నించడం తప్ప పార్టీ వైపు నుంచితగిన స్పందన లేదు. తాజాగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఎపిసోడ్ లోనూ కవితకు బిఆర్ఎస్ నుంచి మద్దతు కరువయింది.'సామాజిక తెలంగాణ సాధించుకోలేకపోయామ'ని కవిత గతంలో చేసిన వ్యాఖ్యలు,బీసీ రిజర్వేషన్లపై తమ పార్టీ విధానాన్ని తప్పుబట్టడంతో గందరగోళం నెలకొన్నది.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# పోచమ్మ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ మహా;** డివిజన్ లోని తోట పోచమ్మ దేవాలయం అభివృద్ధికి తాను శాయశక్తుల కృషి చేస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. ఈ సందర్భంగా మరుపల్ల రవి మాట్లాడుతూ కార్యవర్గంలో దైవ భక్తి కలిగిన వారు దేవాలయం అభివృద్ధికి పాటుపడే వ్యక్తులను కార్యవర్గంలో కొనసాగాలని ఆయన కోరారు. శ్రావణ మాసంలో నిర్వహించనున్న పోచమ్మ బోనాల సందర్భంగా దేవాలయానికి కార్పొరేషన్ నుండి రంగులు వేయించడం అలాగే దేవాలయం ముందు రోడ్డు ఎగుడు దిగుడు ఉన్నదాన్ని సమాంతరంగా చేయడానికి మొరంతో చదును చేసి పారిశుధ్య పనులను చేయిస్తానని ఆయన తెలిపారు. 40 డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి సమక్షం లో తోట పోచమ్మ దేవాలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# జిల్లాలో 25వ తేదీ నుండి రేషన్ కార్డుల పంపిణీ

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లాలోని రెండు నియోజక వర్గాలలో రేషన్ కార్డు పంపిణీపై సమావేశం నిర్వహించి ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పౌర సరఫరాలు, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుండి 10వ తేది వరకు రేషన్ కార్డులు పంపిణీకి అన్ని మండలాల వారిగా షెడ్యూల్ తయారు చేయాలని ఆదేశించారు. మంగళవారం నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎరువులు, విత్తన దుకాణాల్లో తప్పని సరిగా స్టాకు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి బాబు, ఇరిగేషన్ ఈఈలు తిరుపతిరావు, ప్రసాదు, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీ 10వ మహా సభలను విజయవంతం చేయాలి

## బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిల్ల శ్రీనివాస్



**మందమర్రి, మహా :** ఆగస్టు 7 నాడు గోవా రాష్ట్రంలో జరిగే జాతీయ ఓబీసీ 10వ మహా సభలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిల్ల శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షులు ముడారపు శేఖర్ లు పిలుపునిచ్చారు. సోమవారం మందమర్రి పట్టణం బిఆర్ అంబేద్కర్ స్థూపం ముందర ఆ సంఘం గోడపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మేమెంతో మాకంత అనే నినాదంతో హక్కుల కోసం పోరాడి విజయాలు సాధించాలని అన్నారు. రానున్న కాలంలో పాలితులుగా ఉన్నవాళ్ళం కావాలని నినాదంతో ముందుకు కదరాలని వారు వివరించారు. బీసీ లందరూ అంతిమంగా రాజకీయ అధికారాన్ని సాధించి బీసీల ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ నాయకులు తడిగొప్పుల రవిరాజా, జాడ క్రాంతి కుమార్, చెప్పాల రమేష్, క్వాజా ఖలీమోద్దీన్, యోగానంద రావు, సంపత్, కలీల్, ఎర్రన్న, యాదగిరి, రమేష్, యూత్ నాయకులు గరిగె సుమన్, ముష్కే అఖిల్, శ్రావణ్, అర్కటి రవీందర్, అనిల్, ఒమేశ్వర్ పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను అమలు చేయాలి

## ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ




**అమనగల్లు, మహా:** ఎన్నికల హామీ మేరకు ఆగస్టు నెల నుంచి ఆసరా,చేయూత పెన్షన్ల మొత్తం పెంచాలని,లేకుంటే సీఎం రేవంత్ రెడ్డి గద్దె దిగాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు.సోమవారం పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం ఆధ్వర్యంలో సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెన్షన్ మొత్తం పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయక పోవడం సరికాదన్నారు.అధికార,ప్రతిపక్షాలకు విమర్శించుకోవడం తప్ప ప్రజల బాధలు పట్టడం లేదన్నారు.దివ్యాంగుల పెన్షన్ మొత్తాన్ని రూ.6 వేలకు,వృద్ధులు, వితంతువుల పెన్షన్ ను రూ.4వేలకు,కండరాల క్షీణతతో బాధపడుతున్న వారికి రూ.15వేలు ఇవ్వాలనే డిమాండ్ తో ఆగస్టు 13న హైదరాబాద్ లో లక్షలాది మందితో మహా ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు.ఎవ్వరికీ అవసరం లేని అందాల పోటీలు నిర్వహించడానికి ప్రభుత్వం వద్ద నిధులు ఉంటాయి కానీ..పెన్షన్ మొత్తం పెంచడానికి ఎందుకు ఉండవని ప్రశ్నించారు.నాలుగేళ్ల నుంచి వితంతువులు,వృద్ధులు కొత్త పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి,వీ.హెచ్.పీ.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య,ఉపాధ్యక్షుడు వెంకటేష్,జిల్లా అధ్యక్షుడు జంగయ్య,ఉపాధ్యక్షుడు సలీం,రాములు ప్రధాన కార్యదర్శి మైసయ్య,మహిళా అధ్యక్షురాలు యాదమ్మ,మండల అధ్యక్షుడు భాస్కర్,రాజేశ్వర్, వెంకటేష్,సాయిలు,నరసింహ,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, జిల్లా అధ్యక్షుడు బాబు,నరసింహ,నాయకులు కృష్ణ,కిరణ్,శ్రీశైలం, రామచంద్ర,మల్లేష్,మైసయ్య,శ్రీరామ్,శ్రీనివాస్, రమేష్,వెంకటేష్,జంగయ్య మరియు దివ్యాంగుల హక్కుల పోరాట సమితి,చేయూత పెన్షన్ దారుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు విద్యాసంస్థల బందుకు ఎస్ఎఫ్ఐ పిలుపు

- విద్యార్థులు బందును జయప్రదం చేయాలి
- విద్యా సంస్థల యజమానులు సహకరించాలి
- ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఎస్ఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికై, పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదలకై ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడికి వ్యతిరేకంగా ఈనెల 23న చేవెళ్ల డివిజన్ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించడం జరుగుతుందని అరుణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా విద్యార్థులకు ఇచ్చిన హామీ ప్రకారం, స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ కోసం సమగ్ర చట్టం చేయాలని తదితర డిమాండ్లతో ఎస్ఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బందు జరగబోతుందని దీనికి విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు




# ఘనంగా నాయిని జన్మదిన వేడుకలు

**హన్మకొండ మహా;** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కె ఆర్ నాగరాజు, దొంతి మాధవ రెడ్డి, శాసన మండలి సభ్యులు బస్వారాజు సారయ్య , కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ సమక్షం లో కేక్ కట్ చేయగా వారు నాయిని రాజేందర్ రెడ్డికి ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



## పదేళ్ల నిరీక్షణకు ప్రజా ప్రభుత్వం

# చరమగీతం

## లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని

**హన్మకొండ మహా;** కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యుడిగా ఉన్నందుకు చాలా గర్వంగా ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నూతనంగా 2469 మంది లబ్ధిదారులకు ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన మేయర్, కమిషనర్

**వరంగల్ మహా;** వరంగల్ (పశ్చిమ) శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఎమ్మెల్యే కు పూల మొక్కను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# సిఎన్ జీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ను ప్రారంభించిన మంత్రి

**హన్మకొండ మహా;** హన్మకొండ నగర పరిధిలోని మడికొండ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య(సి ఎన్ జీ) గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ను రాష్ట్ర రెవిన్యూ హౌసింగ్ సమాచార ప్రసార శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి, కె ఆర్ నాగరాజు, కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, కార్పొరేటర్లు, ఎన్ జీ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు పునర్జీవం : ఎమ్మెల్యే

- మహిళలను కోటీశ్వరులను చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం
- గత ప్రభుత్వాలు మహిళలను పట్టించుకోలేదు.
- ఇబ్రహీంపట్నంలో ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు
- మహిళలకు వడ్డీలేని రుణాలు పంపిణీ
- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని శాస్త గార్డెన్ లో నిర్వహించిన, ఇందిరా మహిళా శక్తి సంబరాలకు ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్ మెట్టు మండలాలోని మహిళా సంఘాలకు వడ్డీ లేని 3కోట్ల 98 లక్షల రూపాయల రుణాలు, ప్రమాదంలో మరణించిన ఇద్దరు మహిళల కుటుంబాలకు 20 లక్షల రూపాయల ప్రమాద భీమా చెక్కులను, రంగారెడ్డి జిల్లా డిఆర్డిఓ పిడి శ్రీలతతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు పేదల, మహిళల అభివృద్ధికి ఏనాడు పట్టించుకోక మహిళల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గంలోని మహిళలకు వడ్డీ లేని రుణాలను అందజేయడం జరిగిందని అన్నారు. మహిళలు స్వయం శక్తితో ఎదగాలని, స్వయం సంపాదనతో పురుషులకు దీటుగా సంపాదించాలని ఆయన మహిళలకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో, వసతి గృహాలలో, గురుకులాలో చదివే విద్యార్థులకు యూనిఫారంలను మహిళా సంఘాల ద్వారా కుట్టించి, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 45000 ఇందిరమ్మ ఇండ్లు, నిరుపేద మహిళలను యజమానులను చేస్తూ, వారి పేరు మీద పంపిణీ చేసిందన్నారు. బిఆర్ఎస్ విధి విధానాల వల్ల రాష్ట్రం అప్పుల పాలు అయిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తుంటే, ప్రతిపక్ష పార్టీ నాయకులు విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం ఉచిత కరెంటు, ఐదు వందలకే వంట గ్యాస్, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏకకాలంలో రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ, రైతులకు పంట పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా అందించడం జరిగిందని వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం మహిళలకే ఎక్కువ ప్రాతినిధ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మహిళా సంఘాల మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, ఈసీ శేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు అమృత సాగర్, జయమ్మ, రాచర్ల వెంకటేశ్వర్లు, మంకాల దాసు, ముత్యాల రాజశేఖర్ రావు, ఏఎంసి వైస్ చైర్మన్ మంకాల కర్ణాకర్, ఏఎంసి డైరెక్టర్ శ్రీశైలం (రామారావు), శ్రీనివాస్ రెడ్డి, పలు శాఖల అధికారులు, మహిళలు, ఏపిఎంలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# కోయ భాషలో కళ్యాణ శుభలేఖ

- ఆదివాసీ సంకేతాల సంస్కృతిక నూతన దిశ
- భద్రాచలం ఐటిడిఏ ప్రోత్సాహంతో భాషా సంరక్షణకు అడుగులు




**భద్రాచలం, మహా.** తెలంగాణ గిరిజన ప్రాంతాల్లో సాంస్కృతిక పునరుజ్జీవానికి మరో ముఖ్యమైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఇప్పటివరకు పెళ్లిళ్లకు సంబంధించిన శుభలేఖలు తెలుగు భాషలోనే తయారవుతుండగా, ఇప్పుడు మాత్రం కోయ భాషలో ముద్రించిన కళ్యాణ ఆహ్వాన పత్రిక మొదటిసారి వెలుగులోకి వచ్చింది. ఇది కేవలం ఒక పెళ్లి పత్రిక కాదని, ఆదివాసీ ప్రజల భాషా పునాదులను బలపరిచే, వారిని సంస్కృతికంగా ప్రోత్సహించే చిహ్నంగా నిలుస్తోంది. భద్రాచలం ఐటిడిఏ చేపట్టిన ప్రయత్నాల ఫలితంగా కోయ భాషకు లిపి రూపం సిద్ధమై, ఇప్పుడు నిత్యజీవిత సందర్భాల్లో కూడా వాడుకలోకి రావడం గొప్ప అభివృద్ధి అని చెప్పుకోవచ్చు.

### వివరాలు ఇలా ఉన్నాయి

పాల్వంచకు చెందిన గిరిజన యువకుడు కన్న రాజుకు, భద్రాచలం జగదీష్ కాలనీకి చెందిన పూనే లక్ష్మీ శరణ్యకు ఆగస్టు 3న వివాహ ముహూర్తం ఖరారైంది. ఈ శుభవేళను ప్రకటించేందుకు ముద్రించిన ఆహ్వాన పత్రిక పూర్తిగా కోయ భాషలో రూపొందించడం విశేషం. పత్రిక రూపకల్పనలో "పందీర్ ముహూర్తం", "పెళ్లి మూర్తం", "మా సొంత నార్", "కబూర్", "కరంగానూర్ ఇయాల్" వంటి కోయ పదబంధాలు వినియోగించబడి, భాషా సంపదకు కొత్త వెలుగు అందించాయి. పత్రికపై భాగంలో "కోయ భాషలో పెళ్లి శుభలేఖ" అంటూ ముద్రించి, భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ ఐఏఎస్ ప్రేరణకు కృతజ్ఞతలు తెలిపేలా రూపుదిద్దడం, ఈ ప్రక్రియకు నడుముగా పనిచేసిన అధికారుల పట్ల గిరిజనుల నమ్మకాన్ని సూచిస్తుంది.

### కోయ భాష దినోత్సవానాటే ఆవిష్కరణ

ఈ ప్రత్యేకమైన కళ్యాణ పత్రికను సోమవారం భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి రాహుల్ ఐఏఎస్ ఆవిష్కరించారు. అంతేకాదు, కోయ భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని, అదే రోజున ఈ పత్రిక విడుదల కావడం గమనార్హం. ఇది కేవలం ఒక సాంకేతిక ప్రయోగం కాదని, భాషను సంరక్షించే ఉద్యమానికి చిహ్నంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా మాట్లాడిన రాహుల్ ఐఏఎస్ మాట్లాడుతూ, "కోయ భాషలో కళ్యాణ శుభలేఖను చూడడం ఎంతో ఆనందంగా ఉంది. ఇది భాషా గౌరవానికి, సంస్కృతిక పరిరక్షణకు ప్రతీక" అని అన్నారు. భద్రాచలం ఐటిడిఏ గత కొంతకాలంగా ఆదివాసీల భాషా, సంస్కృతుల పరిరక్షణ కోసం చేస్తున్న కృషి ఈ సంఘటన ద్వారా స్పష్టమవుతోంది.



# లారీని ఢీకొట్టిన బైక్ యువకుడి మృతి

**ఆమనగల్లు, మహా:** హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని బైకు ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కన జరిగింది. తలకొండపల్లి మండలం గట్టిఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్ పై ప్రయాణిస్తూ ఆగి ఉన్న లారీని వెనక ఢీకొట్టడంతో అశోక్ (23) అనే యువకుడు మృతి చెందాడు.మరొక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి.పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది

## రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**మంచిర్యాల, మహా :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఖమ్మం జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేకానంద, దామోదర రాజనర్సింహ, దుద్దిల్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ (సీతక్క), వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు అధికారులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం ప్రజాపాలన ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. వర్షాకాలంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటి ప్రాజెక్టులు, చెరువులలో నీటి నిల్వలు స్థాయి వినియోగం, వానాకాలం సీజన్ లో వ్యవసాయ సాగులో ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. రాష్ట్రంలో యూరియా నిల్వలు, ఎరువులు కొరత లేకుండా చూడాలని కోరారు. ప్రతి ఫర్టిలైజర్ షాపును సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టి ఆయా షాపులలో ఉన్న నిల్వలు, నోటీస్ బోర్డులపై ఉంచిన వివరాల పరిశీలన చేయాలని సూచించారు. భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జన జీవనానికి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్, రహదారులు తెగిపోకుండా తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని వివరించారు. జూన్ నెల నుండి ఇప్పటివరకు వర్షపాతం తక్కువగా నమోదైనప్పటికీ గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని, వాతావరణ సూచనలకు అనుగుణంగా జిల్లాలలో చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. వర్షాల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, జిల్లాలలో పిడుగుపాటుతో జరిగే నష్టాల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని చెప్పారు. గిరిజనులు అంటూ వ్యాధుల బారిన పడకుండా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు అందుబాటులో ఉండాలని తెలిపారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండాలని, పశువులకు ఎలాంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుత నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజు కలెక్టర్ల కార్యాచరణకు సంబంధించి ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో నివేదికను అందించాలని చెప్పారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటికి సంబంధించి నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని వివరించారు. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేసి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచామని అధికారులను ప్రశంసించారు. యూరియా కావలసినంత అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఇతర వ్యాపార అవసరాలకు యూరియా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, రైతు సంక్షేమమే అన్నిటికన్నా ముఖ్యమని తెలిపారు. ఎరువులకు సంబంధించి ఫిర్యాదుల కొరకు ప్రతి జిల్లాలో ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 96 లక్షల 95 వేల 299 రేషన్ కార్డులు ఉన్నాయని వెల్లడించారు. ఈ కార్డుల ద్వారా దాదాపు 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. గతంలో చౌక ధరల దుకాణాలపై ప్రజలకు ఆసక్తి ఉండేది కాదని, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో రేషన్ కార్డు, చౌక ధరల దుకాణం విలువ పెరిగిందని, 3 నెలల సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ నెల 25 నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలలో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, శాసన సభ్యులు, జిల్లా ఇన్చార్జి మంత్రులు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని, జిల్లా కలెక్టర్లు సమన్వయం చేసుకుంటూ తగు చర్యలు తీసుకోవాలని, ప్రతి మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది ఖాళీలను పరిశీలించి అవసరమైన మేరకు నియామకంతో పాటు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, గిరిజన ప్రాంతాలలో అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని, డెంగ్యూ, మలేరియా ఇతర జ్వరాలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వాతావరణ శాఖ సూచన మేరకు వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజా సంక్షేమం కోసం 3 గంటల ముందుగా బృందాలను పంపించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా సంక్షేమ చర్యలకు అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ వర్షాకాలం పకృతి ప్రభావం వల్ల ప్రజలకు ఏదైనా విపత్తు కలిగితే జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736 250501 ఏర్పాటు చేసి ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం చేయడం జరిగిందని చెప్పారు. వర్షాకాల పరిస్థితులలో అధికారులందరూ అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు




**ఆదిలాబాద్, మహా:** ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్ లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని ఖర్గే జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. మల్లికార్జున ఖర్గేకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా నాయకులు గిమ్మ సంతోష్ మాట్లాడుతూ ఖర్గే నిరంతర పోరాట స్ఫూర్తికి నిదర్శనమన్నారు. 83 ఏళ్ల వయసులో కూడా పార్టీ బలోపేతం కోసం దేశ ప్రజల సంక్షేమం కోసం అలుపెరగకుండా శ్రమిస్తున్నారని కొనియాడారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతోందన్నారు. బలమైన లోకతంత్రం, సమానత్వం కోసం ఆయన చేస్తున్న కృషి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ జన్మదినం సందర్భంగా ఖర్గే కు దీర్ఘాయుస్సు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిగెల విఠల్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు, నాయకులు సుకేందర్, సింగిరెడ్డి రామ్ రెడ్డి, దొగ్గలి రాజేశ్వర్, దాసరి ఆశన్న, తిరుమల్ రెడ్డి, ఖలీల్, రఫీక్, అతిక్ ఉర్ రహమాన్, శ్రీలేఖ, తమ్మల చందు, మొహమ్మద్ రఫీక్, ముత్యాల నిఖిలేష్, రాజీవ్, ఎల్మ రామ్ రెడ్డి, సాహెబ్ రావు, సట్ల నాగన్న, రాస్పుత్, లింగన్న, డేరా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే నిర్వహించాలి



**ఆదిలాబాద్, మహా:** తెలంగాణలో భూసర్వే జరిగి 70 సంవత్సరాలకుపైన అయిందని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర భూ సర్వే జరపాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. భూ భారతి చట్టం భూ సమస్యలను పరిష్కరిస్తుందా అనే అంశంపై సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం సెమినార్ ఏర్పాటు చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భూ సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ మాట్లాడుతూ రాష్ట్రంలో 70 లక్షల కుటుంబాలు భూసమస్యల పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయని అన్నారు. భూముల ధరలు పెరగడంతో ఘర్షణలు జరుగుతున్నాయని, కోర్టుల లో వచ్చే కేసుల్లో భూ వివాదాలే అధికంగా ఉన్నాయని అన్నారు. రెవిన్యూ సదస్సులలో దాదాపు 9 లక్షల దరఖాస్తులు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణలో భూసర్వే జరిగి 70 సంవత్సరాలకుపైన అయిందన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర భూ సర్వే జరపాలని డిమాండ్ చేశారు. అధునాతన సాంకేతికత అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ బొప్పని పద్మ, పోచక్క, గంగారాం, ఆశన్న, సంతోష్, రామన్న, సిడాం మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 49ను రద్దు చేయాలి



**తలమడుగు మహా న్యూస్:** టైగర్ కారిడార్ పేరుతో ఆదివాసీలను అడవి నుంచి దూరం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నారని తుడుం దెబ్బ జిల్లా డివిజన్ ప్రధాన కార్యదర్శి కుమ్ర జ్ఞానేశ్వర్ అన్నారు. మండలంలోని సుంకిడి అంతర్రాష్ట్ర రహదారిపై ఆదివాసి నాయకులు బైఠాయించి జీవో నెంబర్ 49 ను ఉపసంహరించుకోవాలని తుడుం దెబ్బ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బంద్ ను విజయవంతం చేయడం జరిగింది. కుమ్ర జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ జీవో నెంబర్ 49 ఆదివాసీలకే కాకుండా జిల్లాలో నివసిస్తున్నటువంటి అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరగబోతుందని అటవీ శాఖ అధికారుల చేతుల్లో కీలుబొమ్మల మారడం తప్ప వేరే ఉద్దేశం లేదని వాపోయారు. త్వరలో ఈ జీవోను ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద మొత్తంలో ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తుడుం దెబ్బ అధ్యక్షులు జంగాల పోచ్చన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ భుజంగరావు, మండల యువజన అధ్యక్షుడు నరేందర్ ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

# అభ్యర్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

## జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య



**ఆదిలాబాద్, మహా:** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సరైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచేలా తగు చర్యలు తీసుకుంటామని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య తెలిపారు. గ్రంధాలయ సంస్థ చైర్మెన్ గా నియామకమైన ఆయన లైబ్రెరియన్ సతీష్ చేతుల మీదుగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి అడే గజేందర్, టీఎన్జీఓస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, నవీన్ తో పాటు పలువురు ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందించి శాలువతో సత్కరించారు. పోటీ పరీక్షల అభ్యర్థులతో పాటు పాఠకులకు లైబ్రరీలో సౌకర్యాలు కల్పించేల కృషి చేస్తానని గ్రంధాలయ సంస్థ చైర్మెన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. పెండింగ్లో ఉన్న భవన నిర్మాణ పనుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేస్తామన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన మంత్రులతో పాటు నియోజకవర్గ ఇన్చార్జిలు, అభిమానులకు ధన్యవాదలు తెలిపారు.

# ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి




## జిల్లా చైర్మన్ అర్థం మనోహర్

**ఆమనగల్లు, మహా:** జిల్లా అందత్వ నివారణ సంస్థ లయన్స్ క్లబ్ ఆమనగల్లు, రామ్ రెడ్డి లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు జిల్లా చైర్మన్ అర్థ మనోహర్ ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలో క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరుపేదలకు సేవలు అందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ సేవలు ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. శిబిరంలో కంటి వైద్యులు ఏం చంద్రశేఖర్ 54 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 22 మందిని ఐ ఓ ఎల్ ఆపరేషన్ నిమిత్తం రామ్ రెడ్డి లయన్ హాస్పిటల్ కు తరలించడం జరిగిందని పిఆర్ఓ పాషా తెలిపారు. జిల్లా చైర్మన్ అర్థ మనోహర్, కార్యదర్శి గంప శ్రీనివాసులు, నటరాజ్ యాదయ్య, క్లబ్ కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కొరివి వెంకటయ్య, దూదే రాజేందర్, కర్నాటి కొండల్ రెడ్డి, పిఆర్ఓ పాషా పాల్గొన్నారు.

# జిల్లా బంద్ ప్రశాంతం

- మూతపడిన వ్యాపార, వాణిజ్య సముదాయాలు
- ఉదయం డిపోల నుంచి కదలని ఆర్టీసీ బస్సులు
- జిల్లా కేంద్రంలో తుడుందెబ్బ, ప్రజా సంఘాల భారీ ర్యాలీ
- జీవో 49ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్



**ఆదిలాబాద్, మహా:** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కారిడార్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సంఘం (తుడుందెబ్బ), ప్రజా సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం చేపట్టిన ఉమ్మడి జిల్లా బంద్ ప్రశాంతంగా ముగిసింది. వీరికి వివిధ వామపక్ష పార్టీలు, సంఘాలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపాయి. బంద్ చేపట్టాలని ఆయా సంఘాల నాయకులు ముందుగానే పిలుపునివ్వడంతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో వ్యాపార, వాణిజ్య సముదాయాలను స్వచ్ఛందంగా మూసివేశారు. కొన్ని చోట్ల తెరిచి ఉన్న దుకాణాలను నాయకులు బంద్ చేయించారు. డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు కదలలేదు. డిపో నుంచి బస్సులు బయటకు రాకుండా దాటకుండా ఆదివాసీ, ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు బస్టాండ్ ఎదుట ఆందోళన చేపట్టారు. అక్కడే బైఠాయించి పెద్ద పెట్టున నిరసన తెలిపారు. అనంతరం ఆదిలాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 49 జీఓకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పట్టణ పుర వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలు ప్రారంభమయ్యాయి. కొన్ని దుకాణాలు తెరుచుకోగా.. మిగితావి మూతపడ్డాయి.

**జీఓ 49ను రద్దు చేయాల్సిందే...**

ఆదివాసులను అడవి నుంచి దూరం చేయడానికే ప్రభుత్వాలు కన్జర్వేషన్ టైగర్ కారిడార్ ను తీసుకొచ్చాయని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ డిమాండ్ చేశారు. జీఓ 49 కారణంగా ఆదివాసుల సంస్కృతి, అస్తిత్వం, మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టైగర్ కారిడార్ పేరిట ఆదివాసులను ఇబ్బందులు పెట్టడం సరికాదని మండిపడ్డారు. ఈ జీఓను వెంటనే రద్దు చేయాలని లేనిపక్షంలో మరింత ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు గోడం రేణు, వెట్టి మనోజ్, ఉయిక ఇందర, సోయం లలితబాయి, ముకుంద్, వామపక్ష పార్టీల నాయకులు దర్శనాల మల్లేష్, వెంకట్ నారాయణ, జగన్ సింగ్, రాజు, పరమేశ్వర్, అన్నమొల్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# బస్టాండ్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

**ఆదిలాబాద్, మహా** ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ లో మహిళా ఆత్మహత్య కు యత్నించింది. మహారాష్ట్రకు చెందిన జాదవ్ జ్యోతి అనే మహిళా గత కొంత కాలంగా బోరజ్ మండలంలోని లేఖర్ వాడలో ఉంటున్నారు. అయితే తన కుమారులతో కలిసి సోమవారం ఆదిలాబాద్ బస్టాండ్ లో బస్టాండుకు వచ్చింది. కాగా కాగా బస్టాండ్ లో సోమవారం పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయి పడిపోగా, స్థానికులు 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సిబ్బంది ఆమె ను రిమ్స్ కు తరలించారు



# భూపాలపల్లిలో జర్నలిస్టుల ధర్నా, రాస్తారోకో..

- దుర్భాషలాడిన ఎమ్మెల్యే తీరును ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన..
- క్షమాపణ చెప్పాలని జర్నలిస్టుల డిమాండ్

**భూపాలపల్లి, మహా:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం స్థానిక కాకతీయ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విలేకరులనుద్దేశించి దుర్భాషలాడిన ఎమ్మెల్యే తీరును ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముందు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విలేకరుల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాకతీయ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జర్నలిస్టులందరు ఏకమై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని తగు నిర్ణయాలను ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలో జరిగిన మంత్రుల పర్యటన కార్యక్రమాలను ముకుమ్మడిగా బహిష్కరించారు. ఎమ్మెల్యే అసభ్యకర వ్యాఖ్యలను ఖండిస్తూ స్థానిక కాకతీయ ప్రెస్ క్లబ్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ విలేకరులను ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడిన స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణ రావు ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వానికి రెండు కళ్ళు.. అభివృద్ధి.. సంక్షేమం

- మహిళల సాధికారత పెంపు కోసం ఎన్నో సంక్షేమ పథకాలు
- 21 వేల కోట్లు రుణమాఫీ, 9 వేల కోట్లు రైతు భరోసా చెల్లింపు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**భూపాలపల్లి , మహా :** ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సోమవారం గణపురం మండలం, చెల్పూర్ లో 5.50 కోట్లు కెటిపిపి సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న నూతన బస్ స్టాండ్ నిర్మాణానికి రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ ఛైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మనం చేపట్టే మంచి కార్యక్రమాలకు ఎపుడు దేవుని ఆశీస్సులు ఉంటాయని, అన్ని వేళలా సహకరిస్తారని తెలిపారు. ఈ ప్రాంతం సస్య శ్యామలం గా ఉండాలని ప్రభుత్వం ఎల్లపుడు ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. దివంగత నాటి ముఖ్యమంత్రి వైయస్ రాజ శేఖరరెడ్డి మహిళలను లక్షాధికారులను చేయాలని సంకల్పించారని, ఈ ప్రజా ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కోరిక అని, మహిళలకు మహిళా శక్తి కార్యక్రమం ఏర్పాటు చేసి ఆర్ టి సి బస్సులు, పెట్రోల్ బంక్ లు , సోలార్ పవర్ కేంద్రాలు, దాన్యం సేకరణ కేంద్రాలు, మహిళా క్యాంటీన్లు, అమ్మ ఆదర్శ పాఠశాలలు లాంటి కార్యక్రమాలు ఆడబిడ్డలను ముందు పెట్టి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన 8 లక్షల కోట్ల రూపాయల అప్పు ఉన్న 10 నెలలో 21 వేల కోట్లు రుణమాఫీ చేశామని, రైతు భరోసా 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, 500లకు గ్యాస్ సిలిండర్, పేదలకు మెరుగైన వైద్యసేవలకు 10 లక్షలు ఆరోగ్య శ్రీ ఇస్తున్నామని తెలిపారు. 5 లక్షల కొత్త రేషన్ కార్డు లతో పాటు 16 లక్షల కొత్త పేర్లను పాత కార్డులలో నమోదు చేశామని తెలిపారు ఎం ఇందిరమ్మ ఇళ్లు రాష్ట్ర వ్యాప్తంగా 3.50 లక్షలు ఇస్తున్నామని, భూపాలపల్లి నియోజకవర్గంలో మొదటి విడతలో 3500 ఇళ్లు మంజూరు చేశామని, రాబోయే రోజుల్లో అదనంగా 1500 ఇళ్లు ఇస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి పేద వారికి విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నామని అన్నారు. ఇంకా రాబోయే రోజుల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని స్పష్టం చేశారు. శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు 3 సార్లు ఓడిపోయిన ప్రజల మన్ననలు పొంది నాలుగో సారి అత్యధిక మెజారిటీతో గెలిచారని, ఓడిపోతే ప్రజలను ఒదిలేసే వాడు నాయకుడు కాదు, ఓడినా గెలిచినా ప్రజల వెన్నంటి ఉండే వాడు అసలైన నాయకుడని అభినందించారు. నియోజక వర్గంలో గత ప్రభుత్వం హయంలో వరదలు సంభవించి నష్టం జరిగితే అది పూడ్చడానికి కాలుకు బలపం కట్టుకుని మరి అన్ని శాఖల మంత్రుల దగ్గరికి తిరిగి నియోజక వర్గం అభివృద్ధికి నిద్ర హారాలు మాని కృషి చేస్తున్నారన్నారు. కర్ణాల కుంట 180 ఎకరాల సమస్యను పరిష్కరిస్తామని, ఇందిరమ్మ ఇళ్ల విడతల వారిగా ప్రతి ఒక్కరికి ఇస్తామని పేర్కొన్నారు. సత్తన్నను ఎలా గెలిపించి ప్రభుత్వాన్ని నిలబెట్టారో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా ఈ ప్రభుత్వానికి మీ ఆస్సీస్సులు, గెలిపించాల్సిన బాధ్యత. మీపై ఉందని తెలిపారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## సీఎం, మంత్రుల వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లాల కలెక్టర్లు




**వరంగల్ మహా;** ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో ఉప ముఖ్యమంత్రి మల్లిభట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, దనసరి అనసూయ సితక్క, వివేక్ వెంకటస్వామి, వాకాటి శ్రీహరి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ వర్షాల నేపథ్యంలో ఆయా జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, వానాకాలం పంటల సాగు, అలాగే సీజనల్ వ్యాధుల పై అప్రమత్తత, రేషన్ కార్డుల పంపిణీ పురోగతి, ఇతర అంశాల పై సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో పాటు ఆయా జిల్లా కలెక్టర్లతో కూలంకషంగా చర్చించారు. వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టరేట్ల కార్యాలయాల్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నుండి జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద డాక్టర్ సత్య శారద, స్నేహ శబరిష్, తో పాటు ఆదనవు కలెక్టర్లు సంబంధిత శాఖల జిల్లాల అధికారులు పాల్గొని రేషన్ కార్డులు, మహిళా సంఘాలకు చెక్కులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు తదితర అంశాల పురోగతి పై వీడియో కాన్ఫరెన్స్లో వివరించారు.




# భద్రత, స్వీయ రక్షణతో విధులు నిర్వహించాలి

**మంచిర్యాల, మహా :** భద్రత, స్వీయ రక్షణతో విధులు నిర్వహించాలని మందమర్రి ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ విజయ్ ప్రసాద్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ రఘుకుమార్ లు సూచించారు. సోమవారం ఎస్.డి.టి.సి. (స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్) లో ఈ.పి ఆపరేటర్స్, ఎం.వి డ్రైవర్లకు రెండు రోజుల సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అమలుపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ.పి ఆపరేటర్స్, ఎం.వి డ్రైవర్స్ భద్రత ప్రమాణాలు పాటిస్తూ, స్వీయ రక్షణతో, జాగ్రత్తగా పని చేయాలని అన్నారు. గనులలో ప్రమాదాల నివారణకు సి.ఎం.ఆర్ 2017 లో నిర్దేశించిన రెగ్యులేషన్ ప్రకారం సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అమలుపరచడం, ఎస్.ఎం.పి పాటించాలని, ఏమైనా లోటుపాట్లు ఉంటే సంబంధిత సూపర్వైజర్లు, అధికారులకు తెలియజేసి భద్రత చర్యలు చేపట్టి ప్రమాదాలు నివారించాలని అన్నారు. ఈపీ ఆపరేటర్స్, ఎంవి డ్రైవర్స్ అన్ని రక్షణ చర్యలను పూర్తిగా అవగాహన చేసుకోని ప్రమాద రహిత సింగరేణిగా లక్ష్యాన్ని సాధించాలని వెల్లడించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడమే వారి వారి ధ్యేయంగా విధులను నిర్వహించేలా అన్ని క్యాటగిరి ఉద్యోగులను ప్రోత్సహించాలని ఆదేశించారు.

# ధూమపానంతో విద్యార్థులు పెడదారి

## మత్తు పదార్థాలను అధికారులు అదుపు చేయాలి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బహిరంగ ప్రదేశంలో విచ్చలవిడిగా ధూమపానం సేవిస్తున్న సంఘటన ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మాదక ద్రవ్యాలను అదుపు చేయాలని ఆదేశాలు జారీ చేసినా, ఇబ్రహీంపట్నంలో మాత్రం ప్రభుత్వ ఆదేశాలకు భిన్నంగా, ఆదేశాలను బేకాతరు చేస్తూ, బహిరంగ ప్రదేశాలలో విచ్చలవిడిగా ఇంజనీరింగ్ విద్యార్థులు ధూమపానం సేవిస్తూ మత్తుకై చిత్తవుతున్నారు.

**వివరాల్లోకి వెళితే......**

రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని, పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలోని పలు టీ పాయింట్ల వద్ద, యువత సిగరెట్లు తాగుతూ చెడు దారిన పడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా ప్రైవేట్ హాస్టల్స్ ఉండడంతో ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు, సాయంత్రం వేళ సుమారు 18 సంవత్సరాల నిండని విద్యార్థులు ధూమపానం సేవిస్తూ, పక్కన కూర్చున్న ఇతరులకు పొగ కారణంగా ఇబ్బంది చేకూరుతున్న, పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.


**బహిరంగ ప్రదేశాలలో ధూమపానం నిషేధం...**

బహిరంగ ప్రదేశాలలో ధూమపానం నిషేధం ఉన్నప్పటికీ, టీ పాయింట్ల వద్ద సిగరెట్లను విచ్చలవిడిగా విక్రయించడంతో అక్కడికి వచ్చిన విద్యార్థులు ధూమపానం సేవిస్తూ, ఇతరులకు ఇబ్బందులను కలిగిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టి ధూమపాన నిర్మూలనకు పాటుపడాలని ప్రజలు కోరుతున్నారు. బహిరంగ ప్రాంతాలలో ధూమపానం సేవించే యువతపై జరిమానా విధించి, భవిష్యత్తులో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా కట్టడి చేయాలని కోరారు.

**పోలీస్ అధికారులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలి....**

ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతంలో ఇంజనీరింగ్ కాలేజీలు అధికంగా ఉండడంతో ప్రైవేట్ హాస్టల్లోని విద్యార్థులు సాయంత్రం వేళ కాలక్షేపానికి వచ్చి దురాలవాట్లకు పాల్పడుతున్నారు. పోలీస్ అధికారులు నిఘా పెట్టి ధూమపానాన్ని అదుపు చేయాలని ప్రజలు కోరుచున్నారు. సిగరెట్ల రూపంలో కొందరు ఇంజనీరింగ్ విద్యార్థులు రహస్యంగా గంజాయి కూడా సేవిస్తున్నట్లు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షునిగా శశిధర్ రావు



**కాటారం, మహా :** భూపాల్ పల్లి జిల్లా ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షునిగా వాల శశిధరరావును సోమవారం రోజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాటారంలో జరిగిన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల సమావేశం నిర్వహించారు. మలహర్ మండలం బ్రిలియంట్ పాఠశాల కరస్పాండెంట్ శశిధర్ రావును జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ఎన్నికల పరిశీలకులు కొట్టి శ్రీశైలం తెలిపారు. పాఠశాలల సమస్యలు తీర్చడానికి కృషి చేస్తాననీ శశిధర్ రావు అన్నారు. త్వరలో జిల్లా పూర్తిస్థాయి కమిటీ నియమిస్తామని ఆయన సందర్భంగా తెలిపారు.

# డ్రాప్ చేసి ఇంటికి వచ్చేలోపు దుబాయ్ వెళ్లింది

ఏటా వాహనాలు పెరుగుతుండడంతో రోడ్లపై ట్రాఫిక్‌జామ్ అధికమవుతోంది. ఇటీవల బెంగళూరులో జరిగిన ఓ సంఘటన పెరిగిన ట్రాఫిక్‌కు అద్దం పడుతోంది. దుబాయ్ వెళ్తున్న తన స్నేహితురాలిని ఎయిర్‌పోర్ట్‌లో దింపి ఇంటికి వెళ్లాలని చూసిన ఓ యువతికి ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. దాంతో ఈమె ట్రాఫిక్ దాటుకొని ఇంటికెళ్లేలోపు తన ఫ్రెండు దుబాయ్ చేరిపోయింది. ఈ వివరాలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. కంటెంట్ క్రియేటర్లు ప్రియాంక, ఇంద్రయాణి ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లోని వివరాల ప్రకారం..'నా స్నేహితురాలు దుబాయ్ బయలుదేరుతుండగా బెంగళూరు విమానాశ్రయంలో డ్రాప్ చేశాను. కొద్దిసేపటికి ఆమె దుబాయ్ చేరుకున్నట్లు సమాచారం అందించింది. కానీ నేను అప్పటికీ బెంగళూరు ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయాను' అని పోస్ట్ చేశారు. 'యదార్థ సంఘటనల ఆధారంగా..' అని హెడ్డింగ్‌తో పోస్ట్ చేసిన ఈ వివరాలు వైరల్‌గా మారాయి. ఇప్పటివరకు ఈ పోస్ట్‌కు 19 మిలియన్లకు పైగా వ్యూస్, మిలియన్ కంటే ఎక్కువ లైక్‌లు వచ్చాయి. దీనిపై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. 'బెంగళూరులో కారులో 1 కి.మీ వెళితే 3 గంటలు.. కాలినడక ద్వారా వెళితే 1 కి.మీకు 10 నిమిషాలు సమయం పడుతుంది' అని ఒక యూజర్ తెలిపారు. 'ఇతర రాష్ట్రం నుంచి రెండు గంటలు ఫ్లైట్ ఎక్కి బెంగళూరు ఎయిర్ పోర్టుకు వచ్చిన నేను.. ఇంటికి వెళ్లేందుకు ఐదు గంటలు పట్టింది' అని మరోవక్తి చెప్పారు. జనాభా పెరుగుదల, ఐటీ బూమ్‌కు అనుగుణంగా బెంగళూరులో మౌలిక సదుపాయాలు లేవని కొందరు అభిప్రాయపడుతున్నారు. విమానాశ్రయం సిటీకి 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. రద్దీ సమయాల్లో, ఇంటికి తిరిగి ప్రయాణించేందుకు చాలా సమయం పడుతోంది. ఇది చాలా దేశీయ లేదా తక్కువ దూరంలో ఉన్న అంతర్జాతీయ విమానాల సమయం కంటే చాలా ఎక్కువ అనే వాదనలున్నాయి.







## వారంలో 4 పబ్లిక్ ఇష్యూలు.. 1 లిస్టింగ్

ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో మరోసారి ప్రైమరీ మార్కెట్లు కళకళలాడనున్నాయి. 4 కంపెనీల పబ్లిక్ ఇష్యూలు ప్రారంభంకానుండగా.. మరోవైపు ఇప్పటికే ఐపీవో పూర్తి చేసుకున్న ఏంథమ్ బయోసైన్స్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ కానుంది. గత వారం మెయిన్‌బోర్డ్‌లో ఇష్యూ పూర్తి చేసుకున్న ఏంథమ్ బయోసైన్స్ కౌంటర్‌లో నేడు(21న) ట్రేడింగ్‌కు తెర లేవనుంది. ఇష్యూ ధర రూ. 570కాగా.. 64 రెట్లు అధికంగా స్పందన లభించడం గమనార్హం! కాగా.. వర్క్ స్పేస్ సొల్యూషన్స్ సమకూర్చే ఇండిక్యూబ్ స్పేసెస్‌తోపాటు..డెస్క్‌టాప్,ల్యాప్‌టాప్,మొబైళ్లుతదితర ప్రొడక్టుల పునరుద్ధరణ కంపెనీ జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీవోలు 23న ప్రారంభంకానున్నాయి.

25న ముగియనున్న ఇష్యూల ద్వారా ఇండిక్యూబ్ రూ. 700 కోట్లు, జీఎన్‌జీ రూ. 460 కోట్లకుపైగా సమకూర్చుకునే యోచనలో ఉన్నాయి. రెండు సంస్థలు ఒకే విధంగా రూ. 225-237 ధరల శ్రేణిని ప్రకటించాయి. ఈ బాటలో ఆతిథ్య రంగ సంస్థ బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఐపీవో 24న ప్రారంభంకానుంది. 28న ముగియనున్న పబ్లిక్ ఇష్యూ ద్వారా హోటళ్ల చైన్ సంస్థ రూ. 750 కోట్ల వరకూ సమీకరించే యోచనలో ఉంది. బెంగళూరు, చైన్నై, కొచ్చి తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన 9 హోటళ్ల ద్వారా 1,604 గదులను నిర్వహిస్తోంది. బంగారు ఆభరణ తయారీ సంస్థ శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ ఐపీవో 25న ప్రారంభంకానుంది. దీనిలో భాగంగా కంపెనీ 1.8 కోట్ల షేర్లు కొత్తగా జారీ చేయనుంది. ఈ రెండు సంస్థలు ధరల శ్రేణిని ప్రకటించవలసి ఉంది.

## అనధికార ఆస్తులకు బీ-ఖాతాలు జారీ

బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) 2024 సెప్టెంబర్ వరకు జారీ చేసిన బీఖాతా ఆస్తుల క్రమబద్ధీకరణకు కర్ణాటక రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ చర్య వల్ల ఆయా ఆస్తులను తర్వాత ఏఖాతాకు అప్‌గ్రేడ్ చేసుకునేందుకు వీలవుతుంది. ప్రభుత్వ చర్యలతో ఆస్తుల యజమానులు చాలా కాలంగా ఎదురుచూస్తున్న చట్టపరమైన స్పష్టత రానుందని భావిస్తున్నారు. 'ఆస్తులకు బీఖాతా ధ్రువపత్రాలు ఇచ్చేటప్పుడు కొన్ని ప్రమాణాలు నిర్దేశిస్తాం. ఆస్తి యజమానులు ప్రమాణాలను పాటిస్తే బీ ఖాతా జారీ చేస్తారు. తర్వాత పక్కా డాక్యుమెంట్లతో ఏఖాతాకు అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. కొన్నిలోపాలున్న ఆస్తులకు పరిమిత మినహాయింపులతో బీఖాతా సర్టిఫికెట్లు జారీ చేస్తాం' అని న్యాయ మంత్రి హెచ్‌కే పాటిల్ కేబినెట్ సమావేశంలో తెలిపారు. క్రమబద్ధీకరించిన తర్వాత బీఖాతా ఆస్తి యజమానులకు చట్టపరమైన హోదా దక్కుతుంది. గతంలో అనుమతించని అమ్మకాలు, బ్యాంకు రుణాలు, తనఖాలకు వీలు కల్పించేలా ఏఖాతాకు అప్‌గ్రేడ్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. బీఖాతా అనేది చట్టపరమైన, ప్రణాళికా నిబంధనలను పూర్తిగా పాటించని ఆస్తుల కోసం బీబీఎంపీ నిర్వహించే ఒక రకమైన




ఆస్తి రికార్డు. వీటిలో అనధికార లేఅవుట్లలోని భవనాలు, అనుమతి లేని నిర్మాణాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు లేనివి ఉన్నాయి. ఈ ఆస్తులు పూర్తిగా చట్టబద్ధం కానప్పటికీ యజమానులు ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పన్ను ప్రయోజనాల కోసం వారి వివరాలను నమోదు చేయాలి. ఇప్పటివరకు ఇలాంటి లోపాలున్న ఆస్తులు పూర్తిగా చట్టబద్ధమైనవిగా పరిగణించబడలేదు. అమ్మకం, భవన అనుమతులు పొందడం లేదా ట్రేడ్ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసేటప్పుడు ఆంక్షలు ఎదురయ్యేవి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సాధారణంగా వాటిపై రుణాలు ఇవ్వవు. స్థానిక చట్టాలకు పూర్తిగా అనుగుణంగా ఉండే ఏఖాతా ప్రాపర్టీలతో పోలిస్తే, బీఖాతా ఆస్తులు సాధారణంగా తక్కువ మార్కెట్ విలువ, పరిమిత చట్టపరమైన ప్రయోజనాలను కలిగి ఉంటాయని నిపుణులు అంటున్నారు. అనధికారిక నిర్మాణాలు, ప్రణాళికారహిత అభివృద్ధి బీఖాతాల సమస్యకు దారితీసింది. వీటిని నియంత్రించాలని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో పేర్కొంది. కర్ణాటక టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ చట్టం నియంత్రణ పరిధిలోకి బీఖాతా ఆస్తులను తీసుకురావాలనే డిమాండ్ ఉంది. 2024 సెప్టెంబర్ 30 తర్వాత సృష్టించిన లేదా నిర్మించిన అనధికారిక ఆస్తులకు బీఖాతా జారీ చేయడాన్ని గ్రేటర్ బెంగళూరు గవర్నెన్స్ చట్టం నిషేధించింది. బీఖాతా అనే భావనను 2009లో ప్రవేశపెట్టారని, అందువల్ల 2009కి ముందు జారీ చేసిన అన్ని ఖతాలు ఏఖాతాలేనని తెలిపింది.క్రమబద్ధీకరించిన తర్వాత బీఖాతా ఆస్తి యజమానులకు చట్టపరమైన యాజమాన్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తామని న్యాయవాది ఆకాశ్ బంటియా తెలిపారు. ఈ చట్టపరమైన స్పష్టత వారి ఆస్తులను తాకట్టు పెట్టడానికి, బ్యాంకు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అనుమతిస్తుందని చెప్పారు. ఈ క్రమబద్ధీకరణ చర్య యాజమానికి అధికారిక రుజువుగా కూడా పనిచేస్తుందన్నారు. దీంతో వేలాది మంది నివాసితులకు దీర్ఘకాలిక ఉపశమనం లభిస్తుందని తెలిపారు.

## ఆగస్టు 1 దగ్గరకొస్తోంది..

### బంగారం ఇంకెంత పెరుగుతుంది?

బంగారం ధరలు రోజురోజుకీ పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే తులం (10 గ్రాములు) పసిడి ధర రూ.లక్ష దాటేసింది. అంతర్జాతీయంగా ఔన్స్ బంగారం ధర 3,350 డాలర్ల వద్ద ఉంది. అయితే రాబోయే రోజుల్లో పుత్తడి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. బులియన్ ధరను నడిపించే అనేక అంశాలు రానున్న రోజుల్లో ఉన్నాయని చెబుతున్నారు. ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ఏం మాట్లాడతారు.. అమెరికా, బ్రిటన్, యూరోజోన్ సహా ప్రధాన ఆర్థిక వ్యవస్థల గ్లోబల్ పీఎంఐ డేటా వంటి అంశాలను ట్రేడర్లు నిశితంగా పరిశీలించనున్నారు. బంగారం రేట్లు ఎలా ఉండబోతున్నాయనేదానికి యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్ల నిర్ణయాన్ని కూడా నిశితంగా పరిశీలిస్తారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వీటిలో ఏ అంశాలు బంగారం ధరకు అనుకూలంగా పనిచేసినా పసిడి రేటు పెరుగుతుంది. అమెరికా ప్రకటించినా ప్రతీకార సుంకాల అమలు తేదీ ఆగస్టు 1 డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో వాణిజ్య చర్చలపై అనిశ్చితి బంగారం సేఫ్ హెవెన్ డిమాండ్‌కు ఊతమిచ్చే అవకాశం ఉంది. మరోవైపు ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు దేశీయ పండుగల డిమాండ్ కూడా బంగారం ధరల పెరుగుదలకు మరింత ఊతమిస్తుందని జేఎం ఫైనాన్షియల్



సర్వీసెస్ ఈబీజీ కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మెర్ తెలిపారు. వెంచురా కమోడిటీ అండ్ సీఆర్ఎం హెడ్ ఎన్ఎస్ రామస్వామి ప్రకారం.. బలహీనమైన యూఎస్ డాలర్, భౌగోళిక రాజకీయ నష్టాలు, బలమైన పెట్టుబడిదారుల డిమాండ్, సెంట్రల్ బ్యాంక్ కొనుగోళ్లు కొనసాగడం వంటి సరైన ఉత్ప్రేరకాలు కార్యరూపం దాలిస్తే, 2025 ప్రథమార్ధంలో బలమైన 26 శాతం పెరుగుదల తర్వాత ద్వితీయార్ధంలోనూ బంగారం మరో 48 శాతం లాభపడవచ్చు.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## కేరళ మాజీ సీఎం కన్నుమూత

**తిరువనంతపురం:** ప్రముఖ కమ్యూనిస్టు నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వెలిక్కకట్టు శంకరన్ అచ్యుతానంద కన్నుమూశారు. ఈ రోజు (సోమవారం, జూలై 21, 2025) త్రివేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. 101 ఏళ్ల వయసు కల్గిన అచ్యుతానంద వృద్ధాప్య భారంతో అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరారు. ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఇక ఆయన 2006 నుండి 2011 వరకు కేరళ ముఖ్యమంత్రిగా సేవలందించారు. 1923లో జన్మించిన అచ్యుతానందన్ సీపీఐఎం స్థాపక సభ్యుల్లో ఒకరు. విపక్ష నాయకుడిగా 15 సంవత్సరాలు పనిచేశారు. ఇది కేరళ అసెంబ్లీ చరిత్రలో అత్యధిక కాలం.

**ఉద్యమాలతో స్ఫూర్తి**

ఓ వైపు క్రియా శీలక రాజకీయాల్లో కొనసాగుతూ.. మరో వైపు పలు ఉద్యమాలు చేశారు. పున్నప్రవయలార్ ఉద్యమం, మునార్ భూసేకరణ, లాటరీ మాఫియాపై పోరాటం, ఫిల్మ్ పైరసీపై ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో ఉచితంగా సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేశారు. ఆయన చేసిన ఉద్యమాల కారణంగా 5 ఏళ్ల పాటు జైలు జీవితం, 4.5 సంవత్సరాల పాటు రహస్య జీవితాన్ని గడిపారు



**రాజకీయ జీవితం**

1940లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1964లో సీపీఎం నుంచి బయటకు వచ్చారు. సీపీఐ స్థాపనలో కీలక పాత్ర పోషించారు. 1985లో పొలిట్ బ్యూరో సభ్యుడిగా నియమితులై, 2009లో పార్టీ అంతర్గత విభేదాల కారణంగా తొలగించబడ్డారు. 2016 తర్వాత ఆరోగ్య సమస్యల కారణంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అచ్యుతానందన్ మరణంతో కేరళ రాజకీయ రంగం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయింది. ఆయన ధైర్యం, నిబద్ధత, ప్రజల పట్ల ప్రేమ ప్రజల మనసుల్లో చిర స్థాయిగా నిలిచిపోతాయని రాజకీయ ప్రముఖులు కేరళ రాష్ట్రానికి అచ్యుతానందన్ చేసిన సేవల్ని కొనియాడుతున్నారు.

## పాప్‌కార్న్ రోబోలు వచ్చేస్తున్నాయ్

### త్వరలో అందుబాటులోకి టెస్లా ఆప్టిమస్ హ్యూమనాయిడ్ రోబో.. వివరాలు వెల్లడించిన ఎలాన్ మస్క్

**లాస్ ఏంజెలెస్:** వేడివేడి పాప్‌కార్న్ కావాలంటే చెఫ్‌కే చెప్పనక్కర్లేదు. తమ హ్యూమనాయిడ్ రోబోట్‌కు చెప్పినా చకచకా చేసి ఇచ్చేస్తుందని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చెప్పారు. తమ 'టెస్లా' సంస్థ అభివృద్ధిచేస్తున్న హ్యూమనాయిడ్ రోబో త్వరలోనే అందరికీ అందుబాటులోకి వస్తుందని మస్క్ ప్రకటించారు. లాస్‌ఏంజెలెస్ నగరంలోని ప్రఖ్యాత హాలీవుడ్ ప్రాంతంలో టెస్లా కొత్తగా 'డిన్నర్, సూపర్‌చార్జర్' అనే రెస్టారెంట్, చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటుచేస్తోంది. ఇందులో ఆప్టిమస్ పేరిట ఒక రోబోట్‌ను అందుబాటులోకి తేనున్నారు. ఇది పోప్‌కార్న్‌ను ఎప్పటికప్పుడు తాజాగా తయారుచేసి అతిధులు, వినియోగదారులకు అందిస్తుంది. సంబంధిత వీడియోను మస్క్ తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్‌చేశారు. అడిగిందే తడవుగా కస్టమర్‌కు కవర్‌లో పాప్‌కార్న్‌ను సర్వ్‌చేయడం, ప్రతిగా ధన్యవాదాలు తెలిపిన కస్టమర్‌కు రోబోట్ చేయి ఊపుతూ అభివాదంచేయడం ఆ వీడియోలో ఉంది. '' ఈరోజు ఇంటర్నెట్‌లో చూడదగ్గ వీడియో ఉందంటే అది ఇదే. కస్టమర్‌కు ఆప్టిమస్ ఎంత చక్కగా, పద్ధతిగా, మర్యాదగా సర్వ్ చేస్తోందో చూడండి. ఇదంతా త్వరలో సర్వసాధారణ విషయంగా మారబోతోంది'' అని మస్క్ 'ఎక్స్'లో క్యాప్షన్ పెట్టారు.

హాలీవుడ్‌లోని శాంటామోనికా బోల్వార్డ్ ప్రాంతంలో ఈ అధునాతన డిన్నర్, సూపర్‌చార్జర్ రెస్టారెంట్, చార్జింగ్ స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. '' భవిష్యత్తులో ఈ రోబోలు మన దైనందిన జీవిత పనులన్నీ చేస్తూ మనకు సాయంగా ఉంటాయి. మనం కూర్చున్న చోటుకే వచ్చి మనకు కూల్‌డ్రింక్స్ అందిస్తాయి. పెంపుడు శునకాన్ని అలా బయట వాకింగ్‌కు తీసుకెళ్తాయి. పిల్లలను ఆడిస్తాయి'' అని గతేడాది అక్టోబర్‌లో జరిగిన రోబోల సంబంధ 'మనం' కార్యక్రమంలో మస్క్ వ్యాఖ్యానించారు.




## హమాస్ కమాండర్ బషర్ థాబెట్ హతం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ సైనిక దళం గాజాలో 75 ఉగ్రవాద లక్ష్యాలపై దాడి చేసింది. ఫలితంగా నగరంలో దట్టమైన పొగతో పాటు మంటలు ఎగసిపడుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. హమాస్ కమాండర్ బషర్ థాబెట్‌ను ఐడీఎఫ్ హతమార్చింది. హమాస్ అభివృద్ధి ప్రాజెక్టుల విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న సీనియర్ కమాండర్ బషర్ థాబెట్ మృతిని ఇజ్రాయెల్ రక్షణ దళాలు ధృవీకరించాయి. హమాస్ ఆయుధ ఉత్పత్తి, పరిశోధన కార్యకలాపాలను పర్యవేక్షించడంలో పేరొందిన థాబెట్.. ఇజ్రాయెల్ దాడుల్లో హతం కావడం హమాస్‌కు తీరనిలోటుగా పరిణమించింది. ఐడీఎఫ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ ఆపరేషన్ హమాస్ ఉపయోగించే ఆయుధాల తయారీ ప్రదేశాలు, కీలక ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంది. ఇజ్రాయెల్ వైమానిక దళం (ఐఎఎఫ్)గాజాలోని సైనిక స్థావరాలు, సెల్ సైట్‌లతో సహా దాదాపు 75 లక్ష్యాలను విజయవంతంగా ఢీకొట్టిందని ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధం కారణంగా పరిస్థితులు అంతకంతకూ క్షీణిస్తున్న తరుణంలో ఇజ్రాయెల్ ఈ తాజా ఆపరేషన్ జరిపింది. గడచిన 24 గంటల్లో 115 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇజ్రాయెల్ నిరంతర దాడుల కారణంగా ఆహారం, నీరు, వైద్య సామాగ్రి కొరత ఏర్పడి మరణాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గాజాలో ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ, ట్యునీషియా, ఇరాక్, టర్కీ, లెబనాన్, మొరాకోతో సహా అనేక దేశాలలో నిరసనలు కొనసాగుతున్నాయి. సంఘర్షణలు తీవ్రతరం అవుతున్న తరుణంలో ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనియన్లు.. ఇజ్రాయెల్ స్థిరనివాసుల నీటి వనరులపై దాడులను మరింతగా పెంచారు. ఇరువర్గాల మధ్య శాంతి చర్చలు స్తబ్దుగా ఉండటంతో, కాల్పుల విరమణకు అవకాశాలు అనిశ్చితంగానే ఉన్నాయి. ఫలితంగా గాజాలో మానవతా సంక్షోభం మరింతగా పెరుగుతూ వస్తోంది.





## స్కూల్ భవనంపై కూలిన విమానం..

### 19 మంది దుర్మరణం

**ఢాకా:** బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో పెను విషాదం చోటు చేసుకుంది. సోమవారం (జులై21)న జరిగిన విమాన ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందారు. 100మందికి పైగా గాయాలయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. బంగ్లాదేశ్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన F7 BGI ట్రైనింగ్ విమానం సోమవారం మధ్యాహ్నం ఢాకా నగరంలోని మైల్స్‌స్టోన్ స్కూల్ అండ్ కాలేజ్ ప్రాంగణంలో కూలిపోయింది. మధ్యాహ్నం 1:06 గంటల సమయంలో విమానం టేకాఫ్ తర్వాత దియాబారి అనే ప్రాంతంలో కూలింది. ప్రమాదం జరిగిన సమయంలో స్కూల్‌లో విద్యార్థులు ఉన్నారు. ప్రమాదంలో భారీ ఎత్తున ప్రాణ నష్టం సంభవించింది. గాయపడిన బాధితులు ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు అగ్నిప్రమాద శాఖ అధికారులు తెలిపారు. విమానం కూలడంతో ఘటనా స్థలంలో మంటలు ఎగిసి పడ్డాయి. ఆ ప్రాంతాన్ని పొగకమ్మేసింది. రెస్క్యూ టీములు సహాయక చర్యలు చేపట్టాయి. విమానం బంగ్లాదేశ్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందినదిగా ఆర్మీ అధికారికంగా ధృవీకరించింది.ప్రమాదంతో అప్రమత్తమైన స్థానికులు, పోలీసులు సహాయక చర్యల్ని ముమ్మరం చేశారు.

## ఇస్కాన్ రెస్టారెంట్‌లోకి చికెన్ తెచ్చిన యువకుడు..

ఇస్కాన్ ఆలయాలను కృష్ణ భక్తులు ఎంతో పరిత్రమైనవిగా భావిస్తారు. ఇక్కడ నిత్యం పూజలు, భజనలు జరుగుతుంటాయి. ఇక్కడికి వచ్చేవారు ఆలయంలోని వాతావరణానికి ముగ్ధులవుతుంటారు. ప్రశాంతతకు ఇస్కాన్ ఆలయం చిరునామా అని చెబుతుంటారు. అయితే తాజాగా ఒక ఇస్కాన్ ఆలయంలో ప్రశాంతతను భంగపరిచే ఉదంతం చోటుచేసుంది. అది వైరల్‌గా మారింది. లండన్‌లోని ఇస్కాన్ గోవింద రెస్టారెంట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆఫ్రికన్ సంతతికి చెందిన ఒక యువకుడు కేఎఫ్‌సీ చికెన్ బాక్స్‌తో ప్రాంగణంలోకి ప్రవేశించి, దానిని తినడం మొదలుపెట్టాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిని చూసిన పలువురు నెటిజన్లు ఇదొక రెచ్చగొట్టే చర్యగా, ఉద్దేశపూర్వకంగా చేసిన పనిగా అభివర్ణించారు. వైరల్‌గా మారిన ఆ వీడియోలో గోవింద రెస్టారెంట్‌కు చికెన్ తీసుకువచ్చిన ఆ యువకుడు అక్కడి సిబ్బందితో 'మాంసాహారం ఉందా?' అని అడుగుతున్నట్లు కనిపిస్తుంది. అయితే ఆ రెస్టారెంట్‌లో శాఖాహార వంటకాలు మాత్రమే ఉంటాయని తెలియగానే, ఆ యువకుడు కేఎఫ్‌సీ అతను కేఎఫ్‌సీ బాక్స్ నుండి చికెన్‌ను తీసి, కౌంటర్ దగ్గరే తినడం ప్రారంభిస్తాడు. తరువాత అతను తన దగ్గరునున్న చికెన్‌ను అక్కడున్న అందరికీ చూపిస్తాడు. ఇంతలో అక్కడి సిబ్బంది అతనిని వారించగా, అతను వారితో వాగ్వాదానికి దిగుతాడు. దీంతో వారు సెక్యూరిటీ సాయంతో అతనిని ఆలయ ప్రాంగణం నుంచి బయటకు పంపిస్తారు. ఇస్కాన్‌లోకి చికెన్ తెచ్చిన యువకునిపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసినందుకు అతనిపై పలువురు దుమ్మెత్తి పోస్తున్నారు. మరికొందరు దీనిని జాతివివక్ష చర్యగా పేర్కొంటున్నారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు దాఖలు చేసివుంటారని ఆశిస్తున్నానని ఒక యూజర్ పేర్కొన్నారు. హిందువులు ప్రతీకారం తీర్చుకోరని భావించిన అతను ఈ పనికి పాల్పడి ఉంటాడని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.




మహా పత్రిక



WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | మంగళవారం, హైదరాబాద్ | 22-07-2025

ANN తెలుగు

# మెగాహీరోని చూసి ఫ్యాన్స్ ఫుల్ ఖుష్



'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న రామ్ చరణ్.. తర్వాత సినిమా 'గేమ్ ఛేంజర్'తో అందరినీ పూర్తిగా నిరాశపరిచాడని చెప్పొచ్చు. అయితేనేం 'పెద్ది' మూవీతో అదిరిపోయే రేంజులో అదరగొట్టేయబోతున్నాడని తెలుస్తోంది. ఎందుకంటే ఇదివరకే వచ్చిన గ్లింప్స్ ఎంత రచ్చ చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడు అభిమానులు ఫుల్ ఖుషీ అయిపోయేలా మరో అప్‌డేట్ వచ్చేసింది. త్వరలో 'పెద్ది' కొత్త షెడ్యూల్ షూటింగ్ మొదలుకాబోతుంది. ఇందుకోసం జిమ్‌లో చరణ్ చెమటలు చిందిస్తున్నాడు. మొత్తంగా హ్యాండ్స్, బైసెప్స్ లాంటివి కాస్త గట్టిగానే పెంచుతున్నాడు. ఇందుకు సంబంధించిన ఓ ఫొటోని తాజాగా సోషల్ మీడియాలో చరణే పోస్ట్ చేశాడు. ఇది చూసిన అభిమానులు.. ఈసారి గట్టిగా కొట్టబోతున్నాం అని ఫిక్సయిపోతున్నారు. బుచ్చిబాబు తీస్తున్న 'పెద్ది' చిత్రాన్ని రూరల్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీస్తున్నారు. ఇందులో చరణ్.. క్రికెట్, కబడ్డీ ఆటగాడి పాత్రల్లో కనిపించబోతున్నట్లు సమాచారం. అయితే ఇప్పుడు కనిపిస్తున్న బాడీ.. యాక్షన్ సన్నివేశాల కోసమనిపిస్తోంది. ఈ రేంజు బాడీతో ఫైట్ సీన్స్ అంటే విలన్స్ గాల్లోకి లేస్తారేమో? 'పెద్ది' సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది. ఇకపోతే ఈ సినిమాలో చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్. 'మీర్జాపూర్' ఫేమ్ దివ్యేందు, కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. రోజురోజుకి హైప్ పెంచుతున్న ఈ మూవీ నుంచి ముందు ముందు ఇంకెన్ని సర్‌ప్రైజులు వస్తాయో చూడాలి.

# కూలీ అనేది ఓ సవాల్

చేతిలో పార... తీక్షణమైన చూపులతో 'కూలీ'లో శ్రుతీహాసన్ పోషించిన ప్రీతి పాత్ర లుక్‌ని విడుదల చేసినప్పుడే చర్చనీయాంశమైంది. ఈ చిత్రంలో ఆమెది నెగెటివ్ షేడ్ ఉన్న క్యారెక్టర్ అని, యాక్షన్ సన్నివేశాలు కూడా ఉంటాయనే ఊహాగానాలు నెలకొన్నాయి. అయితే తన పాత్ర గురించిన వివరాలేమీ బయటపెట్టకుండా శ్రుతీహాసన్ 'కూలీ' సినిమా గురించి కొన్ని విషయాలను పంచుకున్నారు. "కెమెరా ముందు నటీనటులకే కాదు... కెమెరా వెనక డైరెక్టర్‌కి కూడా ఈ సినిమా ఓ సవాల్. డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ అలాంటి కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశారు. లొకేషన్‌లో ప్రతి ఒక్కరూ వర్క్ మీదే ఫోకస్ పెట్టాం. సీన్స్ అన్నీ కూడా ఆ ఫోకస్‌ని డిమాండ్ చేశాయి. పైగా ఎక్కువగా నైట్ షూట్స్ చేశాం. నాకు నైట్ షూట్స్ అంటే చాలా ఇష్టం. సీన్ పర్ఫెక్ట్‌గా వచ్చేవరకూ లొకేషన్‌లో ఎవరూ నిద్రపోలేదు. ఇలా సెట్‌లో అందరూ చాలా ఉత్సాహంగా పని చేయడం అనేది అరుదుగా జరుగుతుంటుంది. మంచి కంటెంట్ ఉన్నప్పుడు ఇలా అందరూ లీనమైపోతాం. 'కూలీ' అనేది నాకు అద్భుతమైన అనుభూతిని మిగిల్చిన చిత్రం" అని శ్రుతీహాసన్ పేర్కొన్నారు. ఇక రజనీకాంత్ హీరోగా నటించిన ఈ చిత్రంలో నాగార్జున, అమిర్ ఖాన్, ఉపేంద్ర, సత్యరాజ్ తదితరులు నటించారు. ఆగస్ట్ 14న 'కూలీ' విడుదల కానుంది.





# హీరోయిన్‌గా సూపర్ సక్సెస్.. ఇప్పుడు బిజినెస్‌లోకి

చాలామంది చేతిలో డబ్బులున్నాయా కదా అని ఖర్చు పెట్టేస్తుంటారు. అయితే చేతిలో పైసా ఉన్నప్పుడు దాన్ని ఆదా చేయాలి, లేదంటే ఎక్కడైనా పెట్టుబడిగా పెట్టుకోవాలి అనేది ఇప్పటి ట్రెండ్. దీన్ని చాలామంది హీరోయిన్లు కూడా పాటించేస్తున్నారు. ఓవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు బిజినెస్‌లు మొదలు పెట్టేస్తున్నారు. కొన్నాళ్ల క్రితం నయనతార, సమంత లాంటి స్టార్స్ బ్యూటీ ప్రొడక్ట్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. ఇప్పుడు రష్మిక కూడా ఆ రూట్‌లోకి వచ్చేసింది. గత రెండు మూడు రోజుల నుంచి ఓ గుడ్ న్యూస్ చెప్పబోతున్నానని ఊరిస్తూ వచ్చిన రష్మిక.. ఇప్పుడు ఆ విషయమేంటో బయటపెట్టింది. 'డియర్ డైరీ' పేరుతో ఓ ఫెర్ఫ్యూమ్ బ్రాండ్‌ని లాంచ్ చేసింది. ఇది ఓ బ్రాండో లేదంటే ఫెర్ఫ్యూమో కాదని.. ఇది తనలో ఓ భాగమని చెప్పుకొచ్చింది. ఈ బిజినెస్ విషయంలో అందరి సపోర్ట్ కావాలని చెప్పుకొచ్చింది. ఈ ఫెర్ఫ్యూమ్ ధరల విషయానికొస్తే రూ.1600, రూ.2600 రేంజులో ఉన్నాయి. యానిమల్, పుష్ప 2, ఛావా, కుబేర.. ఇలా వరస బ్లాక్‌బస్టర్స్ కొట్టిన రష్మిక.. హీరోయిన్‌గా సూపర్ ఫామ్‌లో ఉంది. మరి బిజినెస్ ఉమన్‌గా ఎలాంటి సక్సెస్ అందుకుంటుందో చూడాలి? మరోవైపు హీరో విజయ్ దేవరకొండతో ఈమె రిలేషన్‌లో ఉన్నట్లు చాన్నాళ్లుగా రూమర్స్ వస్తున్నాయి. అందుకు తగ్గట్లే అప్పుడప్పుడు ఫొటోలు బయటకొస్తుంటాయి. మరి వీళ్లు పెళ్లి ఎప్పుడు చేసుకుంటారా? అని అభిమానులు కూడా కాస్త ఆత్రుతగానే ఎదురుచూస్తున్నారు. మరి ఈ గుడ్ న్యూస్ ఎప్పుడు చెబుతారో చూడాలి?




# ప్రతి తప్పు ఒక పాఠాన్ని నేర్పిస్తుంది

## తమన్నా

పాన్ ఇండియా రేంజ్‌లో అనేక చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన నటి తమన్నా ఐటెం సాంగ్స్‌తో మరింత పాపులర్ అయ్యారని చెప్పవచ్చు. రీసెంట్‌గా ఆమె నటించిన ఐటెం సాంగ్స్ అంతగా అభిమానుల్లో ప్రభావం చూపాయి. అలాంటి పాటలకు తమన్నా పారితోషికం కూడా బాగానే డిమాండ్ చేస్తారనే టాక్ ఉంది. ఏకంగా ఒక్కో పాటకు రూ. 2 కోట్ల వరకు తీసుకుంటారని టాక్ ఉంది. 18 ఏళ్ల వయసులోనే నటిగా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత తెలుగు, తమిళం భాషల్లో నటిస్తూ అగ్రకథానాయకిగా రాణించిన ఈ ఉత్తరాది భామకు సమీప కాలంలో అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. దీనికి కారణం కూడా స్వయం కృతాపరాధమే అని చెప్పవచ్చు.

కెరీర్లో పెద్దగా వదంతులను ఎదుర్కొనని తమన్నా ఈమధ్య అలాంటి వాటిని ఎదుర్కోవడం గమనార్హం. బాలీవుడ్ నటుడు విజయ్ వర్మతో ప్రేమాయణం సాగించిన తరువాతే ఈ మిల్కీ బ్యూటీపై ట్రోలింగ్స్ ఎక్కువయ్యాయి. వీందుకు వినోదాలకు ఈ జంట కలిసి తిరగడమే ఇందుకు కారణం. అయితే, చాలామంది నటిమణులు ఎదుర్కొంటున్న సమస్యనే ఇప్పుడు తమన్నా కూడా ఎదుర్కొంటున్నారు. తను ప్రేమించిన విజయ్‌వర్మ నుంచి విడిపోవడం వంటి వార్తలు ఇందుకు కారణం. వారిద్దరూ బ్రేకప్ చెప్పకున్నారని సోషల్‌మీడియాలో వైరల్ అయింది. ఆపై వారు జంటగా ఈ మధ్య ఎప్పుడూ కనిపించలేదు. దీంతో ఈ వార్తలు నిజమే అనే సంకేతాన్ని ఇస్తున్నాయి.

కాగా ఇటీవల ఈమె తన ఇన్‌స్ట్రాగామ్‌లో కొన్ని ఫొటోలను, వీడియోలను పోస్ట్ చేసి వేదాంతపు వ్యాఖ్యలు చేశారు. అందులో ప్రతి తప్ప పాఠాన్ని నేర్పిస్తుంది. మెరిసే ప్రతి వస్తువు వెనుక ఒక మెరవని కార్యం ఉంది. నిర్ణయాలు, సంతోషాలు ఇవే ఆ కార్యాలు. అంటూ చెప్పిన ఈ బ్యూటీ మరోసారి ఇలా చెప్పింది 'జీవితంలో అద్భుతాలు జరగాలని ఎదురుచూడొద్దని ఆమె కోరారు. దాని బదులు మనమే అద్భుతాన్ని సృష్టించాలి' అన్నారు. మొత్తం మీద ఈమెకు ఏదో ఒక అనుభవం పెద్ద పాఠాన్నే నేర్పించిందని అర్థమవుతోంది. అది ప్రేమలో విఫలం కావడమేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. మొత్తం మీద తమన్న ఆమధ్య కొంచెం బరువెక్కి ఇప్పుడు మళ్లీ స్లిమ్‌గా తయారైంది. ప్రస్తుతం ఈ భామ చేతిలో తెలుగులో ఒక చిత్రం ,హిందీలో ఒక చిత్రం, మరో వెబ్ సిరీస్ ఉన్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com